సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 22-8-2025 15/-




## నీ ఓటుకు ఉంది విలువెంతో




## భారత జాతీయోద్యమంలో ముస్లింల భాగస్వామ్యం



సహజీవన భావనల సౌరభాలు
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY


Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 33 హైదరాబాద్
శుక్రవారం 22 ఆగస్టు 2025 రూ.15-00
27 సఫర్ 1447 హిజ్రీ


**తొలిగీటు**

ఎవరు సహన గుణాన్ని అలవరచుకోగోరుతారో, వారికి అల్లాహ్ సహనాన్ని ప్రసాదిస్తాడు. సహనం కంటే మేలైనదీ, ఇతోధికంగా మేళ్ళను సమకూర్చేదీ మరొక దైవ వరం లేదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | |
|---|---|
| జిహాదుల జాబితాలో మరో కొత్త జిహాద్ ...... | 04 |
| నీ ఓటుకు ఉంది విలువెంతో ...... | 05 |
| మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి) – 2 ...... | 08 |
| చరితార్థులు–2 : మౌలానా ముహమ్మద్ ఇస్మాయీల్ సంభలి ...... | 11 |
| ఈసీ విశ్వసనీయతపై నీలినీడలు ...... | 14 |
| ధర్మస్థల దారుణాలు–ధర్మానికి తలవంపులు ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... | 19 |
| వయసు, సొగసు, మనసు అదుపులో ఉంటేనే శ్రేయస్సు–2 ...... | 21 |
| భారత జాతీయోద్యమంలో ముస్లిం భాగస్వామ్యం ...... | 24 |
| ఆదర్శపూర్వకమయిన విధివిధానాలు ...... | 26 |
| మనిషి జీవిత లక్ష్యం ...... | 29 |
| క్షణభంగురం ఈ ప్రాపంచిక జీవితం ...... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |


**'అ' ధర్మ స్థల...**




భక్తి ముక్తి ముసుగులో
ధర్మస్థలం దారుణాలు
వందలాది యువతుల
మాన ప్రాణ హరణాలు!
అంగ అర్థ బలంతోటి
సాగుతోంది అరాచకం
ఇకనయినా ఆపండ్రా
ఇంకెన్నాళ్ళీ కిరాతకం!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

## జిహాదుల జాబితాలో మరో కొత్త జిహాద్

దేశంలో రకరకాల జిహాదుల పేరుతో విద్వేష వ్యవసాయం చేస్తున్న వారు ఇప్పుడు కొత్తగా మరో జిహాద్‌ను కనిపెట్టి ప్రజల్లో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

గత కొన్ని నెలలుగా పశ్చిమ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లాలో పని చేస్తున్న డజన్ల కొద్దీ జీన్స్ తయారీ యూనిట్లను స్థానిక అధికారులు అకస్మాత్తుగా మూసివేశారు. ఈ మూసివేతల కారణంగా వందలాది మంది ముస్లిం కార్మికుల కుటుంబాలు క్రుంగిపోయాయి. చాలామంది దశాబ్దాలుగా ఈ వ్యాపారంపైనే ఆధారపడి జీవిస్తున్నారు.

పర్యావరణ కాలుష్యం, అధికారిక లైసెన్సులు లేకపోవడం వంటి కారణాలతో ఈ చర్యలు తీసుకున్నప్పటికీ అసలు కారణం వేరు.

'జీన్స్ జిహాద్' అనే తప్పుడు పుకార్ల కారణంగానే ఈ పరిశ్రమలను మూయించడం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ముస్లింలు జీన్స్ పరిశ్రమలు ఇక్కడ పెట్టి స్థానిక జనాభా మతం మార్చేస్తు న్నారనే గగ్గోలు కారణంగా ఈ చర్యలు తీసుకున్నారని పలువురు వాదిస్తున్నారు.

జీన్స్ జిహాద్ అనేది అర్థం లేని పదం. సరైన విచారణ లేకుండానే అధికారులు చర్యలు తీసుకోవడం అంతకన్నా అర్థం లేని పని. ఫలితంగా అనేక మంది నిరాశ్రయులయ్యారు. ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు. సమాజంలో విద్వేషం పెరుగుతోంది.

'జీన్స్ జిహాద్' అనే పదం కొన్ని సంవత్సరాల క్రితం ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో మత ఉద్రిక్తతలు పెంచడానికి ఉప యోగించడం ప్రారంభించారు. ముస్లింలకు చెందిన జీన్స్ వాషింగ్, టైలరింగ్ యూనిట్లు హిందూ ఆధిపత్య ప్రాంతాల్లో జనాభాను, అక్కడి సంస్కృతిని ప్రభావితం చేసే రహస్య కుట్ర అని సోషల్ మీడియా పోస్టులు వైరల్ చేయడం మొదలయ్యింది.

ఇవన్నీ తప్పుడు పుకార్లనే విషయం పలువురు పదే పదే చెబుతూ వచ్చినా ఈ పుకార్లే ఇప్పుడు పలువురి ఉపాధిని దెబ్బతీశాయి. పశ్చిమ ఢిల్లీలోని ఖయాలాలో జీన్స్ టైలరింగ్ వ్యాపారంలో ఎక్కువ మంది ముస్లిములే. ఉత్తరప్రదేశ్ నుండి వచ్చిన అనేక మంది ముస్లిం కళాకారులు ఇక్కడ బతుకుతెరువు వెదుక్కున్నారు. ఇప్పుడు వారిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని ముస్లిం కళాకారులు అధికంగా ఉన్న సంభల్ విషయంలోను ఇలాంటి పుకార్లే ప్రచారంలో పెట్టారు. ఫలితంగా అక్కడి స్థానిక పాలనాధికారులు పర్యావరణ నిబంధనల సాకు చూపించి లేదా సరైన లైసెన్సులు లేవంటూ జీన్స్ యూనిట్లపై దాడులు చేయడం ప్రారంభించారు.

ఫలితంగా ముస్లిం కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. చాలా మంది స్వస్థలాలకు ప్రయాణం కావలసి వచ్చింది. జీన్స్ తయారీ వ్యాపారంలో ముఖ్యంగా ఢిల్లీలోని పశ్చిమ ఖయాలాలోను, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లోను చాలా మంది ముస్లిము లున్నారు. దశాబ్దాలుగా ఇదే ఉపాధిగా జీవిస్తున్నారు.

చాలామంది కార్మికులు ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్న చిన్న పట్టణాలు, గ్రామాల నుండి వచ్చారు. ఢిల్లీ లోని యూనిట్లు వారికి మంచి వేతనాలు సంపాదించడానికి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవడానికి అవకాశాన్ని కల్పించాయి.

ఇతర కాలుష్య పరిశ్రమలపై తక్కువ పరిశీలన, నిఘా ఉన్నప్పటికీ, ముస్లింలకు చెందిన యూనిట్లను లక్ష్యంగా చేసుకుని మూయిస్తున్నా రనే విమర్శలు వస్తున్నాయి.

ఈ చర్యలు ముస్లిం కుటుంబాలను భయాందోళనలకు గురి చేశాయి. పుకార్ల వల్ల వేధింపులు, బహిష్కరణలు ప్రారంభం కావచ్చనే సందేహాలున్నాయి.

భారత వస్త్ర పరిశ్రమలో ముస్లిముల పాత్ర చాలా పాతది. లక్నో చికింకారి సంక్లిష్టమైన నేత నుండి ఆధునిక కర్మాగారాలలో జీన్స్ కుట్టడం వరకు, ముస్లిం కార్మికులు భారతదేశ వస్త్ర రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

స్వాతంత్ర్యం తరువాత, ఉత్తరప్రదేశ్ మరియు బిహార్ నుండి ముస్లిం కుటుంబాలు టైలరింగ్, గార్మెంట్ శుభ్రం చేసే పని కోసం ఢిల్లీ వంటి నగర పట్టణ కేంద్రాలకు వలస వచ్చారు. కాలక్రమేణా నైపుణ్యం కలిగిన కార్మిక శక్తిని వృద్ధిచేశారు.

'జీన్స్ జిహాద్' ప్రచారం ముస్లిం జీన్స్ కార్మికులను లక్ష్యంగా చేసుకున్న పుకారు మాత్రమే అని పలువురు చెబుతున్నారు. 'జీన్స్ జిహాద్' కథ భారతదేశంలో మైనారిటీ సమాజాలు ఎదుర్కొంటున్న విస్తృత సవాళ్లను ప్రతిబింబిస్తుంది. పుకార్లు అధికారిక చర్యలను ప్రభావితం చేస్తాయి. సమాజంలో చిచ్చు పెట్టే కుట్ర ఇది. ✤

అబ్దుల్ వాహెద్




# నీ ఓటుకు ఉంది విలువెంతో

**నీ ఓటుకు ఉంది విలువెంతో**
**చెయి జారక ముందే చూడన్నా**

గీటురాయి సంపాదకుడు ఎస్.ఎం.మలిక్ చాలా కాలం క్రితం (1989) ఎన్నికల సందర్భంగా రాసిన పాటలోని పంక్తులివి. ఇటీవల వస్తున్న వార్తలను పరిశీలిస్తే ఈ పంక్తుల ప్రాముఖ్యం మరింత స్పష్టంగా అర్థమవుతోంది.

1896లో మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో ఉన్నప్పుడు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఒక వ్యక్తి తనకు ఓటు వేయాలని కోరిన తర్వాత మాత్రమే ఆయనకు ఓటర్ల జాబితాలో తన పేరు ఉన్నట్లు తెలిసింది. ఓటర్ల జాబితాలో తన పేరు ఎలా చేరిందో అని ఆయన ఆలోచించారు. ఓటు తనకు వేయాలని కోరిన వ్యక్తే తన పేరును ఓటర్ల జాబితాలో చేర్చాడని గ్రహించడం ఆయనకు కష్టం కాలేదు.

అంటే ఓటరు జాబితాలు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నిర్దిష్ట అభ్యర్థి విజయావకాశాలను దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తారనేది కూడా అవగతమయ్యింది.

ఆ అనుభవాన్ని గాంధీజీ మరిచిపోలేదు. 1931 సెప్టెంబర్ 17న లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలోని ఫెడరల్ స్ట్రక్చర్ కమిటీలో గాంధీ ప్రసంగిస్తూ కుల మత లింగ ఆర్థిక వివక్షలు లేకుండా అందరికీ వయోజన ఓటు హక్కు ఉండాలని నొక్కి చెప్పారు. ఓటర్ల జాబితాలో ఎలా పేర్లు చేరుస్తారో తనకు తెలుసని కూడా ఆయన నొక్కి చెప్పారు.

బెంగళూరులోని మహాదేవపుర శాసనసభ నియోజకవర్గం, సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం కోసం 2024లో సిద్ధం చేసిన ఓటరు జాబితాలో మోసం జరిగిందని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించినప్పుడు, "ఓటరు జాబితాలు ఎలా తయారు చేస్తారో" నాకు తెలుసునంటూ 1931లో గాంధీ చేసిన వ్యాఖ్యలు తప్పక గుర్తొస్తాయి. మోదీ ప్రధానమంత్రి కావడానికి వీలుగా బీజేపీకి భారత ఎన్నికల సంఘం సహకరించిందని రాహుల్ ఆరోపించారు.

రాహుల్ గాంధీ ఇటీవల చేసిన ఆరోపణలు చూస్తే దిగ్భ్రాంతి కలుగుతుంది. బెంగళూరులోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు లక్షల మంది ఓటర్లున్నారు. అందులో 1,00,250 మంది నకిలీ ఓటర్లని ఆయన ఆరోపించాడు. తన ఆరోపణలకు సాక్ష్యాధారాలు కూడా ఆయన చూపించాడు. బిజేపీకి ఇక్కడ సీటు గెలవడానికి ఈ దొంగఓట్లే కారణమని అన్నారు.

మనకు ఇష్టమైన పార్టీ కాంగ్రెస్‌కి, బీజేపీకి లేదా మరో పార్టీ ఏ పార్టీ అయినా సరే ఈ దొంగఓట్ల వ్యవహారం అందరికీ ఆందోళనకరమైనది. దీనిపై విచారణ జరగాలి. ఇది తేలిగ్గా తీసుకునే వ్యవహారం కాదు.

ఓటరు జాబితాలో ఉన్న అక్రమ వలసదారుల గురించి ఏళ్ల తరబడి విమర్శిస్తున్న బీజేపీ మాత్రం ఇప్పుడు ఎలక్షన్ కమిషన్‌కు మద్దతుగా మాట్లాడడం గమనించదగిన విషయం. ఆరోపణలు ఎన్నికల కమిషన్‌పై ఉన్నప్పుడు బీజేపీ ఎన్నికల కమిషన్‌కు మద్దతుగా నిలబడవలసిన అవసరం ఏముంది?

కాంగ్రెస్ పార్టీ నాలుగుసార్లు రాతపూర్వకంగా కోరినప్పటికీ, పార్టీలకు మెషిన్-రీడబుల్ ఓటర్ రోల్స్‌ని ఎన్నికల కమిషన్ ఇవ్వలేదు. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ, కేవలం ఒక నియోజకవర్గం లోనే నకిలీ ఓటర్లను గుర్తించడానికి, ఏడు అడుగుల ఎత్తు ఉన్న ఓటరు జాబితాల కట్టలను ఆరు నెలల పాటు పరిశీ లించాల్సి వచ్చింది.

మోడీ ప్రభుత్వం డిజిటల్ ఇండియా గురించి గర్వంగా చెబుతుంది. కాని ఎన్నికల కమిషన్ డిజిటల్ ఫార్మాటులో ఓటరు జాబితాను ఇవ్వలేకపోతోంది. అంటే ఓటర్ల జాబితాకు సంబం ధించిన సమాచారాన్ని ప్రజలు తెలుసుకునే అవకాశం లేకుండా చేయాలన్న తపన, తక్కువ సమయంలో ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించకుండా అడ్డుకోవాలనే ఉద్దేశం స్పష్టమవు తోంది.

డిజిటల్ ఫార్మాట్‌లో లేని ఈ డాటాను విశ్లేషించాలంటే చాలా శ్రమ పడవలసి వస్తుంది. కాంగ్రెస్ బృందం లక్షలాది పేజీల ఓటరు జాబితాను మాన్యువల్‌గా స్కాన్ చేసింది. రాహుల్ గాంధీ ఐదు మార్గాల ద్వారా ఓట్ల దొంగతనాన్ని ప్రజల ముందు నిరూపించారు: దొంగ ఓటర్లు (12,000), చెల్లని చిరునామాలు (40,000), ఒకే చిరునామాలో భారీ సంఖ్యలో ఓటర్లు (10,400), చెల్లని ఫోటోలు (4,000) మరియు ఫారం 6 దుర్వినియోగం(33,600).

రాహుల్ ఆరోపించిన ప్రకారం, కనీసం 25 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ విజయానికి ఈ దొంగఓట్లే కారణం.

2024లో ఎన్నికల్లో అవకతవకలపై ఇదే మొదటి ఆరోపణ కాదు. 2024 జూలైలో, 'ఓట్ ఫర్ డెమోక్రసీ (మహారాష్ట్ర)' ఒక నివేదికను విడుదల చేసింది. తీస్తా సెతల్వాద్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో, స్పష్టమైన తారుమారు జరిగినట్లు కనిపిస్తోంది' అని పేర్కొన్నారు. దాదాపు 5 కోట్ల ఓట్లు హఠాత్తుగా పెరగడం బీజేపీకి లాభం చేకూర్చింది. తద్వారా కనీసం 76 సీట్లు గెలుచుకుందని ఆరోపించారు.

2024 సాధారణ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే, పరకాల ప్రభాకర్ ఆగస్టు 8, 2024న చెన్నైలో మాట్లాడుతూ ఎన్నికల సంఘంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

గత డిసెంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికల తర్వాత ఒక నెలలో, పోలింగ్ బూత్‌లో జరిగిన ఓటింగ్‌కు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లు, సీసీటీవీ ఫుటేజ్‌ను ఇవ్వాలని హైకోర్టు ఆదేశిం చింది. కాని ఆ వెంటనే మోడీ ప్రభుత్వం 1961 ఎన్నికల నియమావళిని సవరించింది. ఈ రికార్డులు ఎన్నికల తర్వాత 45 రోజులకు నాశనం చేస్తామని ప్రకటించింది. దొంగఓటర్లు ఓటు చేసిన సాక్ష్యాధారాలు 45 రోజుల తర్వాత దొరకవు. అపారమైన డాటా స్టోర్ చేసుకోగలిగిన సదుపాయాలున్న ప్రస్తుత కాలంలో ఇలా డాటాను నాశనం చేయవలసిన అవసరం ఏముంది?

కొందరు విచిత్రమైన వాదన చేస్తుంటారు. లక్ష పోలింగ్ స్టేషన్ల నుండి సీసీటీవీని సమీక్షించడానికి లక్ష రోజులు పడుతుంది, అంటే సుమారు 273 సంవత్సరాలు అంటున్నారు. ఇంతకన్నా పిల్లచేష్టల వాదన మరొకటి ఉండదు. ఒకేవ్యక్తి కూర్చుని ఈ సమీక్ష ఎందుకు చేస్తారు. వందల మందిని ఈ సమీక్షకు నియ మిస్తే ఈ పని చాలా త్వరగా పూర్తవుతుందన్నది ప్రాథమిక స్థాయి లెక్కలు నేర్చుకునే విద్యార్థి కూడా చెప్పగలడు.

మరో విచిత్రమైన వాదనేమిటంటే, ఓటర్ల జాబితాలో కుంభ కోణం ఉందని అనుమానించినట్లయితే, ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా ఫిర్యాదు చేయాలి. రాహుల్ చాలా ఎక్కువ సమయం తీసుకున్నారనే వాదన. ఇలా ఆలస్యం జరగాలనే కదా ఎన్నికల సంఘం డిజిటల్ కాపీలు ఇవ్వడం లేదు. ఆలస్యం

జరిగే పరిస్థితులు సృష్టించి చట్టం వెనుక దాగి తప్పించుకునే ప్రయత్నాలు స్పష్టంగా కనిపించడం లేదా?

ఎన్నికల సంఘం అధికారిక పత్రాలే సాక్ష్యాధారాలుగా రాహుల్ గాంధీ "ఓట్ల దొంగతనం" గురించి చేసిన ఆరోపణలు నమ్మ శక్యంగా ఉన్నాయి. రాహుల్ లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు నిర్వహిస్తామని చెప్పే బదులు ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను తప్పుడు ఆరోపణలుగా నిరూపించే ప్రయత్నాల్లో పడింది.

ఎలక్టోరల్ రోల్స్, 1960 లోని రూల్ 20(3) (b) ప్రకారం రాహుల్ గాంధీ తన అభ్యంతరాలను అఫిడవిట్‌లో సమర్పించాలని ఎన్నికల సంఘం చెప్పింది. కాని ఈ రూల్స్ ముసాయిదా ఓటర్ల జాబితాలకు మాత్రమే వర్తిస్తామని, తుది ఓటర్ల జాబితాల ఆధారంగా చేసే ఆరోపణలకు కాదని నిపుణులు అంటున్నారు.

వీటన్నింటి తర్వాత రాహుల్ గాంధీ "మ్యాచ్-ఫిక్సింగ్ మహారాష్ట్ర" అనే వ్యాసం రాశారు. ఈ వ్యాసం సంచలనమయ్యింది.

మహాదేవపుర ఎన్నికలపై రాహుల్ గాంధీ ఆరోపణల తర్వాత బీజేపీ కొత్త వాదనతో ముందుకు వచ్చింది. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)కి రాహుల్ ఆరోపణలే సమర్థిస్తున్నాయని వాదిస్తున్నారు. ఈ వాదన విచిత్రమైంది. అంటే ఎన్నికల కమిషన్‌లో అవకతవకలు జరిగాయని ఒప్పుకుంటున్నారా?

బిహార్‌లో SIRని చివరి నిమిషంలో, ఏ పార్టీకి ఎలాంటి ముందస్తు నోటీసు లేదా సంప్రదింపులు లేకుండా ప్రకటించడాన్ని ఇండియా కూటమి వ్యతిరేకించింది.

ఈ ఎన్నికల సంఘం పారదర్శకంగా, సదుద్దేశ్యంతో ఓటరు జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపడుతుందన్న నమ్మకం ఇండియా కూటమికి లేదన్నది స్పష్టంగా తెలుస్తోంది.

రాహుల్ చేసిన ఆరోపణలు, ఈ ఆరోపణలపై నిర్దిష్ట చర్యలకు ఎన్నికల సంఘం సిద్ధపడకపోవడం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమవుతోంది. ఎన్నికల సంఘం విశ్వసనీయత, స్వతంత్ర పనితీరుపై సందేహాలు వెల్లువెత్తాయి. భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం నేపథ్యంలో ఓటర్ల జాబితాపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ప్రజల ఓటు హక్కు గురించి మాట్లాడాల్సి రావడం చాలా బాధాకరం

వయోజన ఓటు హక్కు ఒక ముఖ్యమైన హక్కు అని మహాత్మా గాంధీ 1931 జూన్ 18న యంగ్ ఇండియా పత్రికలో రాశారు.

**దేశంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలి. 1947లోనే సార్వత్రిక వయోజన ఓటు హక్కు భారతదేశ ప్రజలకు లభించింది. అసమానతలు, వర్గ భేదాలు ఉన్న సమాజంలో, 'ఒక వ్యక్తి ఒక ఓటు' అనేది ఒక విప్లవాత్మకమైన మార్పు. ఓటరు జాబితా అనేది ప్రజాస్వామ్యానికి మూలస్తంభం వంటిది. ఓటరు జాబితాలో అవకతవకలకు పాల్పడడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయడమే అవుతుంది. పేదలు, బలహీనుల గొంతు నులమడమే అవుతుంది. బడుగు బలహీన వర్గాలకు తమ జీవితాలను మార్చుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే లభిస్తుంది.**

1949 జూన్ 15న ముసాయిదా రాజ్యాంగంలోని ఆర్టికల్ 289 (ఇప్పుడు ఆర్టికల్ 324)ని ప్రవేశపెడుతున్నప్పుడు, ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాను తయారు చేసేటప్పుడు ఏమాత్రం అన్యాయం చేయకూడదని బీ.ఆర్. అంబేద్కర్ హెచ్చరించారు. అలా జరగడం ప్రజాస్వామ్య పునాదులను కదిలిస్తుందని ఆయన అన్నారు.

దేశంలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలి. 1947లోనే సార్వత్రిక వయోజన ఓటు హక్కు భారతదేశ ప్రజలకు లభించింది. అసమానతలు, వర్గ భేదాలు ఉన్న సమాజంలో, 'ఒక వ్యక్తి ఒక ఓటు' అనేది ఒక విప్లవాత్మకమైన మార్పు. ఓటరు జాబితా అనేది ప్రజాస్వామ్యానికి మూలస్తంభం వంటిది. ఓటరు జాబితాలో అవకతవకలకు పాల్పడడం అంటే రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయడమే అవుతుంది. పేదలు, బలహీనుల గొంతు నులమడమే అవుతుంది. బడుగు బలహీన వర్గాలకు తమ జీవితాలను మార్చుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా మాత్రమే లభిస్తుంది.

ప్రజాస్వామ్యంలో విభిన్న భావజాలాలున్న వారు పోటీ పడతారు. ఓడినవారు విజేతను అంగీకరిస్తారు. ఓడినవారికి ఐదేళ్ల తర్వాత మళ్ళీ ప్రయత్నించే అవకాశం లభిస్తుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగాలంటే ఎన్నికల వ్యవస్థపై నమ్మకం చాలా ముఖ్యం. ఇప్పుడు ఎన్నికల కమిషన్ విశ్వసనీయతపైనే ప్రశ్నలు వస్తున్నాయి. ✤

# తల్లిని ఒప్పించిన తనయుడు

ఎస్.ఎమ్. మలిక్

## మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్ (రజి)

### 2. దైవ మార్గంలో సర్వం సమర్పణ

#### తొలి బాణం

హిజ్రత్ చేసిన తరువాత ఒక సంవత్సరానికి దైవ సందేశ హరులు(స) అరవై మంది ముహాజిరులను ఒంటెల వాహనంపై ఖురైషీలను గురించి వాకబు చేయడానికి గస్తీ దళంగా పంపారు. వారిలో మహనీయ సఅద్(ర) కూడా ఉన్నారు. ఈ దళం ఒక బావి వద్ద ఉన్నప్పుడు ఖురైషీల దళం ఒకటి అటు నుంచి వెళ్ళింది. ఉభయ వర్గాలు పోరాడ కుండా తప్పించుకున్నారు. కాని తిరస్కారుల్లో ఎవరో ఏదో కేక వేశాడు, దానికి బదులుగా మహనీయ సఅద్ ఒక బాణం విసిరారు. ఇది ఇస్లామ్ చరిత్రలో తిరస్కారుల పైన తొలి బాణం!

హిజ్రీ 2వ సంవత్సరం ప్రవక్త మహనీయులు(స) 200 మంది సహచర మాన్యులను తోడుగా తీసుకుని మదీనా నుండి బయలుదేరారు. ముస్లిములు జాగరూకులయి, సన్నద్ధులయి ఉన్నారని శత్రువులు గ్రహించాలన్నది ఉద్దేశం. ఈ సేన ధ్వజం మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర)కు అప్పగిం చారు. ఖురైషీల బిడారు దగ్గరలోనే ఉంది అని తెలిసే బయలుదేరారు ప్రవక్తశ్రీ(స). అయితే, వారికి ఎటువంటి హాని చెయ్యాలన్నది ఉద్దేశం కాదు. ఇది జరిగిన ఆరు నెలలకు బద్ర్ అనే చోట ముస్లిములకు- తిరస్కారులకు మధ్య పోరాటం జరిగింది.

#### జాగరూకత

బద్ర్ పోరుకు కొన్నాళ్ళ ముందు దైవ ప్రవక్త (స) మక్కా బహుదైవారాధకుల ఆచూకీ కోసం మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్‌ని మరో ఇద్దరు సహచరులతో పంపారు. వీరు బద్ర్ బావి వద్ద నిలబడి ఉన్న ఇద్దరు బహుదైవారాధకులను పట్టుకు తెచ్చారు. వారిని విచారించి ఖురైషీలు తొమ్మిది పది వందల మధ్య ఉంటారని సఅద్‌కు తెలిపారు ప్రవక్తశ్రీ (స).

బద్ర్ పోరులో మహనీయ సఅద్, ఆయన సోదరులు ఉమైర్ (ర) ఇద్దరూ ప్రాణాలొడ్డి పోరాడారు, పోరులో ముహాజిరులు ఆరుగురు అమరగతి పొందారు. ఉమైర్(ర) అమరగతి పొందిన వారిలో ఒకరు.

మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర) సయీద్ బిన్ ఆస్‌ని హతమార్చి అతని కరవాలం తీసుకుని ప్రవక్తశ్రీ(స) కు అప్పగించి, ఆ కరవాలం తనకు ప్రసాదించాలని వేడుకుంటారు. ప్రవక్తశ్రీ (స) తొలుత దాన్ని యుద్ధ ప్రాప్తిలో పెట్టవలసిందని ఆదేశిస్తారు. అలాగే చేసి ఆయన కొంత దూరం వెళ్ళారో లేదో ప్రవక్తశ్రీ (స) తిరిగి పిలిపించి ఆ కరవాలం తీసుకోమని పురమాయిస్తారు. ఇది జరిగిన సంవత్సరం తరువాత ఉహుద్ పోరు జరిగింది. అందులో మహనీయ సఅద్ తన శౌర్యం చూపిన తీరు ఎంతో గొప్పది. మహనీయ అబూ ఉస్మాన్(ర) దాని గురించి:

దైవ సందేశహరుల నేతృత్వంలో జరిగిన పోరాటాల్లో కొన్ని కేవలం మహనీయ తల్హా(ర), మరి మహనీయ సఅద్ (ర) సలిపిన పోరాట గాథలే గుర్తుండిపోయాయి జనులకు అని చెప్పారు.

## ప్రవక్త ప్రశంస

ఉహుద్ పోరులో ప్రవక్తశ్రీ(స) గాయపడినప్పుడు కొందరు మాత్రమే ఆయనకు రక్షణగా ఆయన చుట్టూ వలయంగా ఏర్పడ్డారు. వారిలో మహనీయ సఅద్ కూడా ఉన్నారు. ఆ రోజు ప్రవక్తశ్రీ(స) తన అంబుల పొది ఆయన ముందు ఉంచి, "బాణాలు విసురు, బాగా విసురు, నీపై నా తల్లిదండ్రుల్ని అర్పింతుగాక" అనేవారు! ఇది నిస్సందేహంగా మహనీయ సఅద్‌కు గొప్ప గర్వకారణమయిన విషయం.

ఉహుద్ తరువాత రెండేళ్ళకు కందకం పోరాటంలో ఒక తిరస్కారి గుర్రమెక్కి కందకం దాటడానికి సన్నద్ధుడయి నప్పుడు మహనీయ సఅద్ గమనించారు, అతను ముఖం తప్ప వొళ్ళంతా కవచంతో కప్పుకుని ఉన్నాడు. కాని డాలును అప్పుడప్పుడు ముఖానికి అడ్డుగా పెడుతున్నాడు. అలా అడ్డు పెట్టని సమయాన అతని కంటికి గురి చూసి బాణం వదిలారు మహనీయ సఅద్(ర). అతను గుర్రం నుంచి క్రిందపడి అల్లాడసాగాడు. అది చూసి ప్రవక్తశ్రీ(స) కూడా నవ్వేశారు.

## ప్రవక్తశ్రీ(స) ఆలోచన ప్రకారం

కందకం పోరాట కాలంలో 'సలఅ' లోయలో ప్రవక్తశ్రీ(స) కొరకు విశ్రామ స్థలి నిర్మించారు. ఒక రోజు రాత్రి ఆయన(స) దుప్పటి కప్పుకుని పడుకోగా అక్కడ ఆయుధాల శబ్దం విన వచ్చింది. "ఎవరూ?" అని అడిగారు ప్రవక్త మహనీయులు (స). "సఅద్ బిన్ అబీ వక్కాస్" అని సమాధానం వచ్చింది. "ఏం కావాలి?" సఅద్ "వెయ్యి ప్రాణాల కన్నా ప్రియమయిన ప్రవక్తా! ఈ సేవకునికి మీ గురించి భయం వేసింది. అందు వల్ల పహరా కాయడానికి రక్షణగా హాజరయ్యాను" అన్నారు మహనీయ సఅద్(ర). దీనికి ప్రవక్తశ్రీ (స) అన్నారు, "సఅద్! నేను నిద్ర పోలేదు, నేడు ఏ సజ్జనుడయినా వచ్చి కాపలా కాస్తే బావుండేది అనుకున్నాను" అన్నారు.

నిజానికి ఆయన(స) అనుకున్నట్లే మహనీయ సఅద్ కాపలా కాయడానికి వచ్చారు!

## చివరి హజ్జ్

హిజ్రీ 10వ సంవత్సరం ప్రవక్త మహనీయులు(స) హజ్జ్ చేశారు. ఆ రోజుల్లో మహనీయ సఅద్ మక్కాలోనే ఉన్నారు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు ఓ ఆశంక పీడించ సాగింది, తన ఆరోగ్యం బాగా క్షీణించింది, ఇక్కడే మరణిస్తానో ఏమో, దైవం కొరకు, దైవ ధర్మం కొరకు వదలిన నగరంలో తిరిగి వచ్చి మరణించడం సరయినది కాదు అని బాధ పడ్డారు. దైవం ఈ బాధాకర, ఉద్రేక పూరిత స్థితి నుంచి బయట పడేలా చేశాడు. ఒక రోజు విశ్వ కారుణ్య మూర్తి(స) వాత్సల్య పూర్వకంగా పరామర్శించడానికి వచ్చారు. అప్పుడు మహనీయ సఅద్, "నా ఆరోగ్యం ఏమీ బాగాలేదు, పరిస్థితి మీరు కూడా చూస్తూనే ఉన్నారు" అని చెప్పి తన ఆస్తిని గురించి అడిగారు, అప్పుడు ప్రవక్తశ్రీ(స) ఆయన నుదుట చెయ్యి పెట్టి మొత్తం ముఖాన తడుముతూ కడుపు వరకు తడిమి ఇలా ప్రార్థించారు: "దేవా! సఅద్‌కు ఆరోగ్యం ప్రసాదించు, ఇతని హిజ్రత్‌ని పరిపూర్ణం చెయ్యి." (హిజ్రత్ చేసిన చోటనే మృత్యువూ అనుగ్రహించు.)

ఆ సందర్భాన్ని మహనీయ సఅద్(ర) ఇలా వర్ణించారు, "ప్రవక్తశ్రీ(స) చేతి చలువ, ప్రశాంతతల అనుభూతి నాకు అంతర్యంలో నేటికీ కలుగుతూ ఉంటుంది." ఆ తరువాత ఆయన కోలుకుని 45 ఏళ్ళ వరకు జీవించారు. ఆయన మృత్యువు హిజ్రీ 55వ సంవత్సరం, మదీనాలో జరిగింది.

## మహనీయ ఉమర్(ర) ఖిలాఫత్ కాలంలో

మహనీయ ఉమర్ ఫారూక్(ర) ఖిలాఫత్ కాలంలో ఇరాక్‌లో, మహనీయులు అబూ ఉబైదా సకఫీ, ముసన్నా బిన్ హారిసా ఇస్లామీయ సేనకు అధిపతులుగా ఉన్నారు. వారు తమ సేనతో కలిసి ఈరానీ సేనల్నీ, వారి పేరు గన్న సేనాపతినీ అంతమొందించారు. ఇరాక్ పైన ఇస్లామీయ రాజ్య ఆధిపత్యం నెలకొన్నది. ఒక దాని తరువాత మరొక పరాజయం వల్ల కిస్రా రాజ భవనాల్లో శోకాలాపనలు మొదలయ్యాయి.

ఆ కాలంలో ఈరాన్ రాజ సింహాసనం మీద కూర్చున్న స్త్రీని తొలగించి 'యజ్ద్ గర్ద్'ని చక్రవర్తిగా చేయడం జరిగింది. ప్రఖ్యాత రుస్తుమ్, ఫీరోజ్‌లను సేనానులుగా నియమించడం జరిగింది. ఈ ఏర్పాట్లు జరిగిన సమాచారం మహనీయ ఉమర్(ర)కు అందిన తరువాత ఆయన మహనీయ ముసన్నాకు వ్రాశారు, సేనను తీసుకుని సరిహద్దులకు వచ్చెయ్యమని. పరిస్థితుల గాంభీర్యం గమనించి తానే వెళ్ళాలని కూడా అనుకున్నారు, కాని సలహామండలి సమ్మతి లేకపోవడం వల్ల ఆ సంకల్పాన్ని విరమించుకున్నారు. ఆ సమయాన అందరి ఏకాభిప్రాయంతో మహనీయ సఅద్ బిన్ అబీ వక్కాస్(ర)ని ఈ భయంకర యుద్ధ భూమికి కమాండర్ ఇన్ చీఫ్‌గా పంపడం జరిగింది.

## రాయబారం

మహనీయ సఅద్, ఖిలాఫత్ కేంద్రం మదీనా నుంచి సేన తీసుకుని మహనీయ ముసన్నా సైనిక క్యాంప్, 'కాదిసియ' చేరేటప్పటికి మహనీయ ముసన్నా దివంగతులయిపోయారు. అప్పుడు మహనీయ సఅద్, చక్రవర్తి వద్దకు ఎనమండుగురు వ్యక్తుల రాయబార బృందం పంపారు. గౌరవనీయులయిన ఆ మహనీయులు చక్రవర్తి 'యజ్ద్ గర్ద్' సమక్షంలో ఇస్లామ్ గురించి, దైవ సందేశహరులను గురించి సమగ్రంగా పరిచయం చేశారు. ఇంకా ఇస్లామ్ సందేశాన్ని కూడా అందజేశారు.

ఆ పిలుపుకు సమాధానంగా చక్రవర్తి పరిహసిస్తూ అపసవ్యమయిన ప్రశ్నలు వేయసాగాడు. దానికి బృందం నాయకుడు, "మాకు ఈ విషయంలో అనవసరమయిన మాటలు నచ్చవు. మేము మూడు విషయాలు పెడుతున్నాము, వీటిలో మీకు ఇష్టమయిన దాన్ని మీరు ఎన్నుకోవచ్చు. 1. ముస్లిమయి మా సోదరులయిపోవడం. 2. కప్పం కట్టి సామంతులయిపోవడం. మీకూ, మీ ఆస్తులకు మేము రక్షణ కల్పిస్తాము. 3. కాదంటే మైదానంలోకి వచ్చేయండి, కరవాలమే తీర్పు చెబుతుంది" అన్నారు.

యజ్ద్ గర్ద్ అగ్గి మీద గుగ్గిలం అయ్యాడు. "రాయబారుల్ని చంపడం సరయినదయితే మీలో ఒక్కడూ బతికి బయట పడేవాడు కాదు. అయినా మిమ్మల్ని వదలి పెడుతున్నాను. వెళ్ళండి, వెళ్ళి మీ నాయకునికి చెప్పివేయండి, రుస్తుమ్‌ని మీ కొరకు పంపిస్తున్నాము, అతను మిమ్మల్ని అందరినీ కాదిసియ కందకంలో పూడ్చి పెడతాడు, సరేనా" అన్నాడు. ✤


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు
Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

### Bank Details


Geeturai Weekly
Account No:1042789768
Bank: Central Bank of India
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: Geeturai Weekly
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com



# మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్ సంభలి
## (1899 -1975)

92




బ్రిటిష్ బానిసత్వం నుండి విముక్తి కోసం పోరు బాట సాగాలని ప్రజలను తన అనర్గళ ఉపన్యాసాలతో ఉత్తేజపర్చి 'చిచ్చరపిడుగు లాంటి వక్త'గా ఖ్యాతిగాంచిన మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్ సంభలి 1899లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంభల్ జిల్లా మొరాదాబాద్‌కు చెందిన దీపాసరాయ్‌లోని విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి మున్షి కిఫాయతుల్లా గొప్ప పండితుడిగా విఖ్యాతుడు. ప్రాథమిక విద్యను స్థానికంగా పూర్తి చేసిన మౌలానా సంభలి కొంతకాలం ఆంగ్ల విద్యను అభ్యసించారు. అనంతరం బహావల్‌పూర్‌లోని జామియా ఉస్మానియాలో ఆనాడు గొప్ప పండితులుగా, స్వాతంత్ర్య సమరయోధులుగా ఖ్యాతి గడించిన పలువురు పండితుల వద్ద ఆయన అరబిక్ విద్య నేర్చారు. ఈ క్రమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చారిత్రాత్మక సిల్క్ రుమాలు కుట్రకేసులో పాల్గొన్న మౌలానా ముహమ్మద్ మియాఁ మన్సూర్ అన్సారి సహచర్యం లభించింది. ఆ పరిచయంలో ఆయన పూర్తిస్థాయి బ్రిటిష్ వ్యతిరేక పోరాటయోధులయ్యారు. 1919లో జరిగిన జలియన్‌వాలాబాగ్ దుస్సంఘటకు నిరసనగా సంభల్‌లో జరిగిన ప్రజా ప్రదర్శనలో మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్ సంభలి తొలిసారిగా ఆంగ్ల ప్రభుత్వ చర్యలను దుయ్యబడ్తూ చేసిన ప్రసంగం ప్రజలను బహుధా ఆకట్టుకోగా, ఆంగ్ల ప్రభువుల ఆగ్రహానికి గురయ్యింది. ఆయనలోని విప్లవాత్మక భావాలకు, పదునైన ప్రసంగాల తీరుతెన్నులకు కలవరం చెందిన బ్రిటిష్ ప్రభుత్వం 1921 ఫిబ్రవరి 22న అరెస్టు చేసి రెండు సంవత్సరాల జైలుశిక్షకు గురిచేసింది. బ్రిటిష్ ప్రభుత్వ చర్యలకు ఏమాత్రం జంకని మౌలానా సంభలి ఒకవైపున విద్యాభ్యాసం సాగిస్తూ మరోవైపున భారత జాతీయోద్యమంలో చురుకైన భాగస్వామి అయ్యారు. 1930 నాటి శాసనోల్లంఘన ఉద్యమంలో ఆయన మరోమారు ఆరు మాసాల పాటు కఠిన కారాగారశిక్షను అనుభవించారు. 1939లో ద్వితీయ ప్రపంచ యుద్ధం ఆరంభమయ్యాక జాతీయ కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలలో పాల్గొన్న మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్ సంభలిని బ్రిటిష్ ప్రభుత్వం మురాదాబాద్‌లో అరెస్టు చేసి తొమ్మిది మాసాల జైలు శిక్ష విధించింది. 1942లో ఆరంభమైన 'క్విట్ ఇండియా ఉద్యమం'లో తన ఆలోచనాత్మక ప్రసంగాలతో ప్రజలను ఆకర్షించిన మౌలానా సంభలి పట్ల ఆగ్రహించిన ఆంగ్ల ప్రభుత్వం ఆయనను గృహ నిర్బంధానికి గురిచేసి సంవత్సరం తరువాత విడుదల చేసింది. 1946లో జరిగిన ఎన్నికలలో మౌలానా సంభలి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 1952 నాటి ఎన్నికలలో ఆయన పాల్గొనలేదు. ఢిల్లీ కేంద్రంగా ఏర్పడిన 'నాజిం-ఎ-ఆల-ఆఫ్ జమీయతుల్ ఉలైమా' విద్యాసంస్థలో అధ్యాపకునిగా బాధ్యతలను చేపట్టారు. ఆయన ఆ తరువాత పలు ప్రాంతాలలో వివిధ విద్యాసంస్థలకు మార్గదర్శనం చేస్తూ గడిపారు. ఈ సందర్భంగా పలు గ్రంథాలను కూడా ఆయన రచించి, ప్రచురించారు. చివరివరకు ఆధ్యాత్మిక విద్యాబోధన తోపాటుగా, సాంఘిక, రాజకీయ రంగాలలో కూడా పలు కార్యక్రమాల నిర్వహణలో చురుగ్గా గడిపిన మౌలానా ముహమ్మద్ ఇస్మాయిల్ సంభలి 1975 నవంబర్ 23న సంభల్‌లో కన్నుమూశారు. ✤



9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

# నాన్న



**డా. ముహమ్మద్ హసన్**
*అసిస్టెంట్ ప్రొఫెసర్*

ప్రపంచంలో డబ్బుతో అన్ని సౌకర్యాలను పొందగలం. కానీ మానవ సంబంధాలలో కొన్ని విలువలను, బంధాలను డబ్బుతో వెలకట్టలేం. అందులోనూ తల్లిదండ్రుల విలువను దేనితోనూ ముడిపెట్టలేం.

అందుకే మన గ్రంథాలు తల్లి పాదాల చెంత స్వర్గం ఉందని, తండ్రి స్వర్గానికి ప్రవేశ ద్వారము వంటి వాడని కీర్తించాయి. తల్లి చేసే శారీరక శ్రమ కళ్ళకు కనిపించినా దాని వెనకాల నాన్న "త్యాగం" కూడా ఉంటుందనేది జగమెరిగిన సత్యం. తల్లి ఋణం, తండ్రి ఋణం ఎప్పటికీ తీరదు, తీర్చలేము కూడా. అమ్మ నవ మాసాలు మోస్తుంది, అన్ని సపర్యలు చేస్తుంది. ఆ సపర్యలకు కావాల్సిన వన్నీ "నాన్న" సమకూర్చుతాడు. అందుకే నాన్న గొప్పతనం తెర వెనుక పాత్రకు పరిమితమైనా "నాన్న" లేని జీవితం – ఆ కుటుంబం తెడ్డులేని నావలాంటిది. తీరం తెలియని ప్రయాణం లాంటిది. అందుకే "నాన్న" విలువను తెలియజేసే ఓ చిన్న కథను చదవండి.

ఓ పిల్లవాడు తండ్రిని ఊర్లోకి వచ్చిన "సర్కస్"ను చూపించాలని బాగా ఇబ్బంది పెట్టాడు. తన వద్ద డబ్బులు లేవని, డబ్బులు రాగానే చూపిస్తానని చెప్తాడు. అయినా ఆ అబ్బాయి మారాం చేస్తాడు. ఎంత చెప్పినా వినకుండా బాగా అల్లరి చేసి ఏడ్వటం మొదలు పెట్టాడు. దానికి కరిగిపోయిన తండ్రి సరే ఈ రోజు సాయంత్రం "సర్కస్"కు తీసుకొని వెళ్తాను సిద్ధంగా వుండు అని చెప్తాడు. దానికి సంతోషపడిన ఆ పిల్లవాడు ఆనందంతో తండ్రిని గట్టిగా వాటేసుకుంటాడు. చెప్పినట్లుగానే సాయంత్రం "సర్కస్"కి తీసుకొని వెళ్తాడు. ఆ సర్కస్‌లో కనిపించే ఆట బొమ్మలు, తిను బండారాలు ఇప్పించాలని తండ్రిని బాగా ఇబ్బంది పెడతాడు. కానీ తండ్రి వద్ద "డబ్బులు లేని విషయం" తెలియని "పసితనం" ఆ పిల్లవాడిది. పిల్లవాడి మొండి ప్రవర్తనకు తండ్రి లోలోన బాధపడతాడు. సర్కస్‌లో విపరీతమైన "రద్దీ" వుండటం వల్ల తండ్రి వేలు పట్టుకొని నడుస్తున్న పిల్లవాడు ఒక్కసారిగా చేయి వదిలి పెడతాడు. ఈ క్రమంలో తండ్రి ఒక వైపు, పిల్లవాడు మరో వైపు చేరుకుంటారు. తనకు తన తండ్రి

కనిపించటం లేదని బిగ్గరగా ఏడవటం మొదలు పెడ్తాడు. ఆ ఏడుపు శబ్దాలు విన్న దుకాణదారులు అందరూ ఆ పిల్లవాడి చుట్టూ గుమికూడి తన తండ్రి వేలు పట్టుకొని నడుస్తున్నప్పుడు ఏవైతే అడిగాడో అవన్నీ ఇస్తాము అని చెప్పినా వినకుండా తన తండ్రి మాత్రమే కావాలి, అవేమీ వద్దని ఇంకా బిగ్గరగా ఏడ్వటం మొదలుపెడతాడు. "నాన్నా ఎక్కడున్నావ్? ఎటు వెళ్ళిపోయావ్" అంటూ గట్టిగా ఏడుస్తూ ఉంటాడు. ఆ చుట్టు పక్కలవారు ఎంతగా సముదాయించినా కుదుటపడడు. "ఇవన్నీ ఏమి వద్దు నాకు మా నాన్న మాత్రమే కావాల"ని మారాం చేస్తాడు. ఈలోగా పిల్లవాడికి "నాన్న" కనిపిస్తాడు. ఒక్క పరుగున వెళ్ళి తండ్రిని గట్టిగా హత్తుకుంటాడు. ఇది చూసిన ఆ దుకాణదారులందరూ సంతోషపడి అక్కడి నుండి వెళ్ళిపోతారు. చూశారా! అంతకు ముందు (తప్పిపోవడానికి ముందు) ఆ పిల్లవాడు కొనుక్కోవా లనుకున్నవన్నీ డబ్బులతో ముడిపడివున్న వస్తువులే కానీ అవి కొనే స్తోమతలేని తండ్రి గూర్చి పిల్లవాడికి తెలియని అమాయకత్వం.

అమ్మ జన్మనిస్తుంది, పెంచి పెద్ద చేస్తుంది. కానీ మనం నాన్న వేలు పట్టుకొనే నడుస్తాం. చిన్నతనంలో నాన్నే మనకు "సూపర్ హీరో". అందుకే ఆ అనుభూతిని ఆస్వాదిస్తే తప్పు వ్యక్తం చేయలేం. ఏదో పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి "ఫాదర్స్ డే" లాంటివి సెలబ్రేట్ చేసుకొని సంతోషపడుతాము. కానీ ఎన్ని సెలెబ్రేషన్స్ చేసినా తండ్రి "ఋణం" తీర్చలేం. అందుకే నాన్నను ఒకరోజు కాకుండా జీవితాంతం ప్రేమిద్దాం. ఆస్తులు ఏం పంచి ఇచ్చావు అని అడగకుండా జన్మ నిచ్చినందుకు గర్వపడుదాము.

"నాన్న" నుండే మనం వారసత్వాన్ని తీసుకుంటాం. నువ్వు ఎవరు అనే దానికి సమాధానం మీ "నాన్నే". నీ ప్రతీ ఆధారం మీద (ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, రేషన్ కార్డు, ఎలక్షన్ కార్డు, సర్టిఫికేట్లు) నాన్న పేరు ఉంటుంది. ఇంతకు మించి ఏం కావాలి మనకు. తండ్రి నుండి మనం వారసత్వంగా ఇన్ని తీసుకున్నప్పుడు తిరిగి మనం ఏం ఇవ్వగలం? విధేయత, కృతజ్ఞత- ఇవి ఆశించి మీ "నాన్న" మిమ్మల్ని పోషించడు, అలాగే పెంచడు కూడా. ఆయన మీ నుండి ఏం ఆశిస్తాడు? మీరు సంపాదించే వజ్రాలు, వైఢూర్యాలు కాదు కదా? ఆయన కళ్ళముందు మీరు ఉన్నత స్థానాలకు ఎదిగితే అదే ఆయనకు మీరిచ్చే అసలైన బహుమతి. కొంతమంది నాన్నలకు ఆ అదృష్టం వుండదు. ఎందుకంటే నాన్నలు పిల్లలు పెద్దయి ప్రయోజకులు కాకముందే ఈ లోకం నుండి వెళ్ళిపోతారు. వారు ఎంత దురదృష్టవంతులో ఒకసారి ఆలోచించండి! తండ్రి వున్నా మీరు ఆదరించకపోవడం వల్ల వృద్ధాశ్రమాల్లోనో, అనాథ శరణాలయాలలోనో ఉంటున్న వారు ఎంతమంది? ఇక్కడ ఎవరు ఎవరిని గౌరవించాలి.

**"నాన్న" బ్రతికి ఉండగానే ఆయన ముఖంలో ఆనందం చూడండి. అంతేకాని ఆయన పోయాక ఆయన ఫోటోలతో పేపర్లలో ప్రకటనలు ఇచ్చి ఊరంతా పండుగలాగ భోజనాలు పెట్టడం కాదు. బ్రతికుండగానే ఆదరించండి అలా అయితేనే అనాథశరణాలయాలు, వృద్ధాశ్రమాలు తగ్గుతాయి.**

ఓసారి ఆలోచించండి. నువ్వు గెలిచినప్పుడు పది మందికి ఆనందంగా చెప్పుకునే వ్యక్తి నీ భుజాలపై తట్టి "నువ్వు గెలుస్తావులే" అని దగ్గరకు హత్తుకునే మనిషి "నాన్న" ఒక్కడే. "నాన్న" అనే పిలుపు ఒక్కసారి దూరం ఐతే నువ్వు గుండెలు పగిలేలా ఏడ్చినా, దిక్కులు పిక్కటిల్లేలా పిలిచినా బదులు రాదు. ఆ పిలుపు రక్తం పంచి ఇచ్చిన "నాన్న"కు మాత్రమే సొంతం.

మన సంతోషంలో తన సంతోషం వెతుక్కునే నిష్కల్మష హృదయం నాన్నది. తను జీవితంలో ఓడినా మన గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తాడు. తను దీపంలా కరుగుతూ మనల్ని వెలుగులో ఉంచుతాడు. నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువు తున్నప్పుడు తనే (మా నాన్న) విద్యార్థిలా ఆనందపడ్డాడు. తను ఆశించే స్థాయికి నేను చేరుకునేలోపే విధి తనను కాటేసింది (రోడ్డు ప్రమాదంలో). మీలో ఎవరైనా మీ నాన్న త్యాగం లేకుండానే ఎదిగారా? గుండెల మీద చేయి వేసుకొని చెప్ప గలరా? మొక్క ఎదగడానికి వేర్లు భూమిలో ఉండి అది చెట్టుగా విస్తరించేలా చేస్తాయి. కుటుంబానికి నాన్న కూడా "వేరు" లాంటివాడే. అందుకే "నాన్న" బ్రతికి ఉండగానే ఆయన ముఖంలో ఆనందం చూడండి. అంతేకాని ఆయన పోయాక ఆయన ఫోటోలతో పేపర్లలో ప్రకటనలు ఇచ్చి ఊరంతా పండుగలాగ భోజనాలు పెట్టడం కాదు. బ్రతికుండగానే ఆదరించండి అలా అయితేనే అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు తగ్గుతాయి. ✤



# ఓట్ల చోరీపై రాహుల్ ప్రజెంటేషన్ ఈసీ విశ్వసనీయతపై నీలినీడలు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**తాజా రాజకీయ పరిణామాల్లో** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. కర్నాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో జరిగిన ఓట్ల దొంగతనం ఉదంతాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ, ఒకే నియోజకవర్గంలో లక్షకుపైగా దొంగ ఓట్లు వేసినట్లు ఖచ్చితమైన ఆధారాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు బలంగా నిలిచే సాక్ష్యాలను తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ప్రజలకు, మీడియాకు చూపించారు.

రాహుల్ గాంధీ మాటల్లో, ఇది కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైన విషయం కాదని, దేశవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను భ్రష్టు పట్టించే ఒక గంభీరమైన కుట్రలో భాగమని స్పష్టం చేశారు. ఆయన వాదన ప్రకారం, ఈ విధమైన ఓటర్ల జాబితా లోపాలు, నకిలీ ఓట్ల చొరబాటు, స్వతంత్ర ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

ఈసీ (ఎన్నికల కమిషన్)పై కూడా రాహుల్ గాంధీ నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల నిర్వహణలో తటస్థతను పాటించాల్సిన సంస్థ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి పరోక్షంగా మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ యంత్రాంగం పక్షపాతం లేకుండా ఉండాలి. కానీ ఇక్కడ పరిస్థితి వేరుగా ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం అని ఆయన స్పష్టం చేశారు.

రాహుల్ గాంధీ తన ప్రజెంటేషన్‌లో, ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపులు, తప్పుడు పేర్ల చేర్పులు, నకిలీ ఐడీల వినియోగం వంటి అంశాలను పత్రాలతో సహా చూపించారు. ముఖ్యంగా మహదేవపుర ఉదంతాన్ని ఉదాహరణగా తీసుకుని, ఆ నియోజకవర్గంలోని అసలు ఓటర్ల సంఖ్య కంటే ఎక్కువ ఓట్లు ఎలా నమోదయ్యాయో వివరించారు.

ఆయన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమయ్యాయి. బీజేపీ, ఈసీ ఈ ఆరోపణలను ఖండించగా, కాంగ్రెస్ మాత్రం వీటిని ప్రజాస్వామ్య రక్షణకు సంబంధించిన అత్యవసర హెచ్చరికగా పరిగణిస్తోంది.

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక పవిత్ర హక్కు. ఆ హక్కు భ్రష్టు పట్టేలా చేసే ప్రతి చర్యను బహిర్గతం చేయడం, దానిపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ వాద ప్రతివాదాలకే పరిమితం కాకుండా, ఎన్నికల వ్యవస్థలో నమ్మకం నిలిపే కర్తవ్యానికి సంబంధించినవే అని చెప్పాలి.

ఒక దేశ ప్రజాస్వామ్యం సజీవంగా, బలంగా నిలబడాలంటే ఎన్నికలు కేవలం ఓట్ల సేకరణ ప్రక్రియ కాకుండా, న్యాయం, పారదర్శకత, సమాన అవకాశాల వేదికగా ఉండాలి. ఈ సూత్రాన్నే ఆధారంగా చేసుకుని రాహుల్ గాంధీ చేసిన విస్తృత ప్రజెంటేషన్, ఆయన ప్రతిపాదించిన అంశాలు కేవలం విమర్శలకు మాత్రమే కాదు, భవిష్యత్తు ఎన్నికల సంస్కరణలకు దారితీసే మార్గదర్శకాలుగా కూడా నిలుస్తాయి. కనుక రాహుల్ గాంధీ ప్రెజెంట్ చేసిన ప్రతి పాయింట్‌ను విడివిడిగా పరిశీలిస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలకూ, భారత రాజ్యాంగ సూత్రాలకూ అన్వయిస్తూ విశ్లేషించే ప్రయత్నం చేద్దాం.

## 1. ఎన్నికల కమిషన్ స్వతంత్రత

రాహుల్ పాయింట్: ఎన్నికల కమిషన్‌పై కేంద్ర ప్రభుత్వ ప్రభావం పెరిగి, స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం దెబ్బతింటోందని ఆరోపించారు.

**అంతర్జాతీయ ప్రమాణాలు:** యునైటెడ్ నేషన్స్ International Covenant on Civil and Political Rights (ICCPR) ప్రకారం, ఎన్నికల నిర్వహణ సంస్థలు పూర్తిగా స్వతంత్రంగా, రాజకీయ ఒత్తిడి లేకుండా పనిచేయాలి.

**భారత స్థితి:** నియామకాల విధానం పారదర్శకంగా లేకపోవడం, కీలక నిర్ణయాల్లో ప్రభుత్వం ప్రాధాన్యం పెరగడం విమర్శలకు గురవుతోంది. 2024 ఎన్నికలలో పోలింగ్ షెడ్యూల్ ప్రకటించడంలో వచ్చిన ఆలస్యం ఈ సమస్యను మరింత స్పష్టంగా ఎత్తి చూపింది.

## 2. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం

**రాహుల్ పాయింట్:** లక్షలాది అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడం లేదా తప్పుగా నమోదు కావడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన.

**అంతర్జాతీయ ప్రమాణాలు:** యూరోపియన్ యూనియన్ Election Observation Missions ప్రకారం, ఓటర్ల జాబితా ఖచ్చితంగా, సమయానికి నవీకరించబడాలి, అందరికీ తన పేరు ధ్రువీకరించుకునే అవకాశం ఉండాలి.

**భారత స్థితి:** పలు రాష్ట్రాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ లోపాలు, డేటా మైగ్రేషన్ సమస్యల కారణంగా ఈ లోపాలు వస్తున్నాయి. ఉదాహరణకు, 2018 తెలంగాణ ఎన్నికల్లో లక్షలాది ఓటర్లు తమ పేర్లు తప్పిపోయినట్లు గుర్తించారు.

## 3. మీడియా స్వేచ్ఛ, సమాన అవకాశాలు

**రాహుల్ పాయింట్:** ఎన్నికల సమయంలో అధికారపక్షం మీడియా సమయాన్ని అధికంగా వినియోగించుకోవడం, ప్రతిపక్షానికి తగిన స్థలం ఇవ్వకపోవడం.

**అంతర్జాతీయ ప్రమాణాలు:** OSCE Copenhagen Document ప్రకారం, మీడియా అన్ని పక్షాలకూ సమాన ప్రాధాన్యత కల్పించాలి, పక్షపాత కవరేజ్ నివారించాలి.

**భారత స్థితి:** 2024లో న్యూస్ ఛానళ్లలో అధికారపక్ష కవరేజ్ 65 - 70% వరకు ఉండగా, ప్రతిపక్షానికి 30% కంటే తక్కువ సమయం లభించింది. సోషల్ మీడియా వినియోగపరంగా కూడా అన్యాయం జరుగుతోందని నివేదికలు సూచిస్తున్నాయి.

## 4. ఎన్నికల నిధుల పారదర్శకత

**రాహుల్ పాయింట్:** ఎలక్టోరల్ బాండ్స్ (Electoral Bonds) వ్యవస్థ వల్ల విరాళాల మూలాలు గోప్యంగా మారి, కార్పొరేట్ ప్రయోజనాలు పెరిగాయి.

**అంతర్జాతీయ ప్రమాణాలు:** GRECO (Council of Europe) మార్గదర్శకాలు, రాజకీయ విరాళాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో ఉండాలి, ఏ విరాళమూ అనామకంగా ఉండకూడదు.

**భారత స్థితి:** సుప్రీంకోర్టు 2024లో Electoral Bondsను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. అయినప్పటికీ, గత ఎన్నికలలో ఈ వ్యవస్థ వలన అధికార పక్షానికి విపరీత ఆర్థిక ఆధిక్యం ఏర్పడింది.

## 5. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు

**రాహుల్ పాయింట్:** అధికారపక్షం ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా చర్యలు ఆలస్యం కావడం లేదా లేకపోవడం.

**అంతర్జాతీయ ప్రమాణాలు:** African Union Democracy Charter ప్రకారం, ఎన్నికల సమయంలో ఎవరైనా అభ్యర్థి లేదా పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే, వారు ఎవరైనా వెంటనే చర్యలు తీసుకోవాలి.

**భారత స్థితి:** 2019 మరియు 2024లో ఉన్నతాధికారులపై వచ్చిన ఫిర్యాదులు ఎక్కువగా నామమాత్రపు నోటీసులకే పరిమితమయ్యాయి.

## ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం సంస్కరణలు

రాహుల్ గాంధీ ప్రజెంటేషన్ పాయింట్లు కేవలం రాజకీయ విమర్శలు కాకుండా, ప్రజాస్వామ్యాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు సమీపించే మార్గంలోకి నడిపించే సూచనలు. ఎన్నికల కమిషన్ స్వతంత్రత, ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, మీడియా సమానత్వం, నిధుల పారదర్శకత, మోడల్ కోడ్ కఠిన అమలు- ఇవన్నీ కలిసే నిష్పక్షపాత ఎన్నికలకు పునాది. భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు కోసం ఇవి కేవలం చర్చలకే కాక, చట్టపరమైన, వ్యవస్థాపరమైన చర్యలకు దోహద పడేలా చూడాలి.

ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ సూచనలను నిర్లక్ష్యం చేయకుండా, వాటిపై తక్షణమే కార్యాచరణ ప్రారంభించడం అనివార్యం. ✤

# ధర్మస్థల దారుణాలు - ధర్మానికి తలవంపులు



**ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**'నేను నా చేతులతో వంద శవాలకు పైగా ధర్మస్థలలో పూడ్చి పెట్టాను'.**

ఇది ఏదో సాధారణ కొటేషన్ కాదు, ఒక జాతి మనస్సాక్షిని నిలదీసే ప్రశ్న. మతపరంగా పవిత్రంగా భావించబడే స్థలాల్లో పాతిపెట్టబడిన మానవ కళేబరాల సత్యాలను వెలికితీసిన ధైర్యవంతుడి మాటలివి.

జూలై 3, 2025న కర్ణాటకలోని ధర్మస్థల పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఫిర్యాదు చేసినవాడు అక్కడ పని చేసే ఒక పారిశుధ్ధ్య కార్మికుడు. ప్రాణ భయం వల్ల తన అసలు పేరు బయట పెట్టకుండా, 'భీమ' పేరుతోనే దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాడు.

భీమ వాంగ్మూలం ప్రకారం, తాను ధర్మస్థలలో పనిచేసిన సమయంలో ఎన్నో శవాలను స్వయంగా పూడ్చానని, వాటిలో స్కూల్ విద్యార్థినులు, దుస్తులు లేకుండా ఉన్న మహిళలు, కొంతమంది మగవాళ్ల మృతదేహాలు కూడా ఉన్నాయని తెలిపాడు. ఈ మాటలు వినడం, నమ్మడం కొంచెం కష్టమనిపించినా, అతను సుప్రీంకోర్టుకు సమర్పించిన సీల్డ్ కవర్ ఆధారాలు, చూపించిన ప్రదేశాల్లో జరుగుతున్న తవ్వకాలతో ఎముకలు వెలికి వస్తుండటం, ఇవన్నీ అతని వాంగ్మూలానికి బలం చేకూర్చుతున్నాయి. ప్రస్తుతం సిట్ విచారణ కొనసాగుతోంది. ఇది కొత్త కాదు. ఇది ఒక్కటే కాదు, మొదటిది కాదు, చివరిదీ కాకపోవచ్చు.

2006లో ఉత్తరప్రదేశ్‌లోని నిథారి గ్రామంలో జరిగిన ఘటన మానవ చరిత్రలోనే అత్యంత దారుణమైనది. సీరియల్ కిల్లర్ సురేంద్ర కోలీ, తన యజమాని మనీందర్ సింగ్‌తో కలిసి 31 మంది చిన్నారులపై అత్యాచారం చేసి, హత్య చేసి, మృతదేహాల భాగాలను ఇంటి వెనుక పూడ్చివేశాడు. స్థానికుల ఫిర్యాదుతో తవ్వకాలు ప్రారంభించిన పోలీసులు మానవత్వాన్ని వణికించే దృశ్యాన్ని చూశారు. ఇది పేదరికం, నిస్సహాయత, సమాజ మౌనాన్ని ఆయుధంగా మార్చుకున్న దారుణ కృత్యం.

2017లో హర్యానాలోని డేరా సచ్చా సౌదా ఘటన కూడా అలాంటిదే. బాబా రామ్ రహీమ్ గుర్మీత్ సింగ్ అలియాస్ డేరాబాబా అనే 'ఆధ్యాత్మిక గురువు' పై అనేకమంది మహిళలపై అత్యాచారం, ఇద్దరు శిష్యుల హత్య, అనాథలపై శారీరక ప్రయోగాలు వంటి కేసులు నమోదయ్యాయి. తీర్పు వెలువడిన రోజే అతని అనుచరులు దేశవ్యాప్తంగా అల్లర్లు సృష్టించారు. ఇది

ధర్మస్థలాల పేరుతో ఎలా అధికార రాజ్యం నడుస్తుందో చూపిన ఘోర ఉదాహరణ.

హర్యానాలోని సోనెపట్‌కు చెందిన రాంపాల్ సింగ్ జతిన్ నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా ఉద్యోగం వెలగబెట్టి, ఉద్యోగం ఊడబెరికిన తరువాత, సద్గురురామ్ పాల్‌జీ మహరాజ్‌గా అవతారం ఎత్తాడు. 2006లో అతడిపై హత్యకేసు నమోదైంది. ఈ బాబా శయన మందిరం పక్కగదిలో గర్భనిర్ధారణ కిట్లు, కండోమ్స్ అందుబాటులో ఉంటాయి. బాబాకు పాలతో స్నానం చేయించి, ఆ పాలతో పాయసం వండి భక్తులకు ప్రసాదంగా పంచిపెడతారు. కాళ్ళు కడిగిన నీళ్ళను భక్తితో చప్పరించి, నెత్తిన చల్లుకుంటారు. రాంపాల్ బాబా ఆధ్యాత్మిక డైరీలో ఇలాంటి లీలలు అనేకం ఉన్నాయని భక్తులు చెప్పుకుంటారు. ధర్మస్థలాల్లో, ధార్మిక స్వాములుగా చెలామణి అయ్యే అత్యధిక మంది జీవితాలు వివాదాలు, విలాసాల మయమే.

భక్తి ముసుగులో ఆధిపత్యం, అధికారం ముసుగులో భయం, పుణ్యకార్యం పేరుతో ప్రజల శరీరాలను వినియోగించుకోవడం, ఇవన్నీ మన 'ధర్మస్థలాల్లో' చాలాకాలంగా అమలవుతున్న చీకటి కార్యాలు. ప్రజలు దేవుడు అని వెళ్లే చోట్ల, కొన్నిచోట్ల, అవి మృత్యు కుహరాలుగా మారిపోతున్నాయి. మీడియా మౌనం, రాజకీయ అధికారం, పోలీసు నిర్లక్ష్యం, ఇవన్నీ కలిసి ఈ దుర్మార్గాలకు కవచం అవుతున్నాయి.

నిజమైన ధర్మం అంటే, మహిళలకు గౌరవం, పిల్లలకు భద్రత, బలహీనుల స్వరానికి వేదిక కావాలి. భీమ వంటి ఒక పారిశుద్ధ్య కార్మికుడు మాత్రమే కాక, సమాజం మొత్తం తన స్వరాన్ని వినిపించాలి. మతం పేరుతో మౌనం కొనసాగిస్తే, అది మనల్ని అజ్ఞానం అనే దేవుడికి బలిచేస్తుంది.

భక్తి కేంద్రాల ముసుగులో ఇలాంటి దారుణాలు గతంలో ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ఆధ్యాత్మికత పేరుతో మానవ హక్కులు ఉల్లంఘించబడిన సందర్భాలు, భక్తుల సెంటిమెంట్లను ఉపయోగించి అక్రమాలను దాచిన ఉదాహరణలు చాలా ఉన్నాయి. ఈ ఘటనలు మనకు చెబుతున్న పాఠం ఏమిటంటే, పుణ్యక్షేత్రాలు కూడా విమర్శనాత్మక దృష్టి నుంచి మినహాయింపు పొందకూడదు.

ఇలాంటి ఘటనలు కేవలం నేరాలే కాదు, సమాజ నైతికతకు, మానవత్వానికి విసిరిన సవాళ్లు. భక్తి అనేది అంధ విశ్వాసం కారాదు, ప్రశ్నించే ధైర్యం, సమానత్వం, న్యాయం కూడా దానిలో భాగం కావాలి. ఒక సంఘటన బయటపడిన వెంటనే దానిని కప్పిపుచ్చకుండా, లోతుగా విచారణ జరిపి సత్యాన్ని బహిర్గతం చేయడం, ఇది ప్రభుత్వం, మీడియా, పౌర సమాజం అందరి బాధ్యత.

ధర్మస్థల ఘటన మనకు ఒక కఠినమైన ప్రశ్న సంధిస్తోంది. ఆధ్యాత్మికత అనే పవిత్ర స్థలంలో కూడా మనం మానవ హక్కులను రక్షించుకోలేమా? సత్యాన్ని వెలికితీయడం కేవలం న్యాయ ప్రక్రియ కాదు, అది మన సమాజ భవిష్యత్తు కోసం చేసే పోరాటం. ఈ కేసు నిగ్గు తేల్చడమే కాకుండా, ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో, భక్తి అనే పదం కూడా ఏదో ఒక రోజు సమాజంలో నమ్మకాన్ని కోల్పోతుంది.

నిజానికి ధార్మిక సంస్థల నిర్మాణాలు పెరుగుతున్నాయి, పెద్దవవుతున్నాయి. కాని వాటి నీడలో నడుస్తున్న నిర్భాగ్యుల జీవితాలు చిన్నబోతున్నాయి. అన్యాయానికి, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఎవరైనా గొంతెత్తితే వారి గొంతునొక్కడం, మీడియా, పోలీసు, రాజకీయ నాయకుల మౌనం, ఇవన్నీ కలిసి ఈ దుర్మార్గాలను పెంచి పోషిస్తున్నాయి.

భీమ వాంగ్మూలం ఇప్పుడు భారతదేశాన్ని కుదిపేసింది. పవిత్రత అన్నది గోడలపై కాకుండా, మానవ హక్కుల రక్షణలో ఉండాలి. ప్రతి దురాచారాన్ని ప్రశ్నించే ధైర్యమే ఈ దేశపు నిజమైన ధర్మం.

అనేక శతాబ్దాలుగా మన దేశం ధర్మాన్ని పోషించింది. కాని ఇప్పుడు ధర్మస్థలాలు దుర్మార్గాలకు నిలయమవుతున్నాయంటే, ఇది మన చైతన్యాన్ని కాపాడుకోవాలనే పిలుపు. నిజమైన మతస్థలాలు న్యాయాన్ని నిలబెట్టాలి, అమానవీయతను కప్పిపుచ్చకూడదు. ఈ ఉదంతం ఎంత దారుణమైనదైనా, అది మంచి మార్గానికి తలుపులు తెరవాలి. మానవతకు న్యాయం జరగాలి.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

35 ఆయత్‌లు

# 46. అల్ అహ్కాఫ్

మక్కా అవతరణ

23 – 26 అతను చెప్పాడు, “దాని ఎరుకయితే అల్లాహ్‌కే ఉంది.[26] నేను కేవలం నాకు ఇచ్చి పంపించిన ఆ సందేశాన్ని మీకు అందజేస్తున్నాను. కాని నేను గమనిస్తున్నాను, మీరు అజ్ఞానాన్నే అవలంబిస్తున్నారు.”[27] తరువాత వారు ఆ యాతనా శిక్షను తమ లోయల్లోకి రావడం గమనించగానే అన్నారు, “ఇది మేఘం, మాకు జల సమృద్ధిని చేకూర్చుతుంది”– “అదేమీ కాదు,[28] మీరు తొందరపెడుతున్న విషయమే ఇది. ఇది తీవ్రమయిన గాలి దుమారం, ఇందులో వ్యధాభరితమయిన పీడన వచ్చేస్తోంది; దాని ప్రభువు ఆదేశంతో అది ప్రతి వస్తువునూ నాశపరుస్తుంది.” కడకు వారి స్థితి ఏమయిందంటే, వారు నివసించే స్థలాలు తప్ప ఏమీ కానరాకుండా పోయింది. ఇదేవిధంగా మేము అపరాధులకు ప్రతిఫలాన్నిస్తాము.[29] మేము, మీకు కూడా ఇవ్వనిదంతా వారికి అనుగ్రహించాము.[30] వారికి మేము చెవులు, కళ్ళు, హృదయం అన్నీ ఇచ్చిపెట్టాము. కాని ఆ చెవులూ వారికి ఏ విధంగానూ ఉపకరించలేదు. కళ్ళూ, హృదయమూ ఏదీ ఉపకరించలేదు. ఎందుకంటే వారు అల్లాహ్ వచనాలను తిరస్కరించేవారు,[31] వారు స్వయంగా తాము దేనిని ఆటపట్టించేవారో దాని చక్రవ్యూహంలోనే చిక్కుకున్నారు.

26. అంటే, మీపైకి దైవశిక్ష ఎప్పుడు దాపురిస్తుందో అది దైవానికే ఎరుక. మీపైన శిక్ష ఎప్పుడు అవతరించాలో, మీకు ఎప్పటి వరకు గడవునివ్వాలో నిర్ణయించడం నా పని కాదు.

27. అంటే, మీరు మీ అవివేకం వల్ల నా ఈ హెచ్చరికను ఏదో వేళాకోళంగా భావిస్తున్నారు, అలాగే ఏదో ఆటలా శిక్ష రావాలని కోరుకుంటున్నారు. మీరు ఏమాత్రం ఊహించ నయినా లేదు, దేవుని శిక్ష ఎలా ఉంటుందో, మీ చేష్టల వల్ల అది ఎంతగా మీకు చేరువయిపోయిందో.

28. వారికి ఈ సమాధానం ఇచ్చిందెవరో వివరణ ఇక్కడ లేదు. స్వయంగా వచన తీరునుబట్టి ఇది, ఆచరణాత్మకంగా పరిస్థితుల స్వరూపం వారికి ఇచ్చిన సమాధానంలా ద్యోతక మవుతోంది. వారు అది తమ లోయలకు జల సమృద్ధినివ్వ డానికి వచ్చిన మేఘాలని అనుకున్నారు. కాని వాస్తవానికి అది వారిని సర్వనాశనం చేయడానికి పైపైకి వస్తున్న తుఫాను.

29. ఆద్ జాతి గాథ వివరాల కొరకు చూడండి ఖుర్ఆన్ అవగాహనం, సం.3, అల్ ఆరాఫ్: పాద సూచికలు 51–56 హూద్: పాద సూచికలు 54–65 సం.5, అల్ మూ'మి నూన్: పాదసూచికలు 34 – 37 అష్ షు'అరా: పాద సూచి కలు 88–94 సం.6, అల్ అన్కబూత్: పాదసూచి 65 సం.7, హా మీమ్ అస్సజ్దా : పాద సూచికలు 20, 21.

30. అంటే ధనం, సంపదలు, బలం, అధికారం, ఏ విషయం లోనూ మీకూ వారికీ పోలికే లేదు. మీ అధికార పరిధి ఈ మక్కా నగర పొలిమేరలకు బయట ఎక్కడా లేదు, వారయితే ఓ పెద్ద భూభాగాన్నీ ఆక్రమించుకుని ఉండేవారు.

31. ఈ క్లుప్తమయిన వాక్యంలో ఒక ముఖ్యమయిన యదార్థం తెలుపడం జరిగింది. దేవుని వచనాలే మానవునికి యదార్థం గురించి సరయిన అవగాహనం, చేతన కలగ జేస్తాయి. ఈ అవగాహన, చేతనలు మానవునికి ప్రాప్తమయి నట్లయితే అతను కళ్ళతో సరిగ్గా చూడగలుగుతాడు, చెవులతో సవ్యంగా వినగలుగుతాడు, మనోమస్తిష్కాలతో సక్రమంగా యోచిస్తాడు, సరయిన నిర్ణయాలు చేయగలుగుతాడు. కాని అతను దైవ వచనాలను నమ్మనిరాకరించినప్పుడు కళ్ళుండీ సత్యాన్ని గ్రహించగలిగే దృష్టి ప్రాప్తం కాదు, చెవులుండీ అతడు ప్రతి హితవచనానికి చెవిటివాడయిపోతాడు, దైవం అనుగ్రహించిన మనోమస్తిష్కాల వరప్రసాదాల ద్వారా వక్రంగా ఆలోచిస్తాడు, తప్పుడు పరిణామాలనే గ్రహిస్తాడు, చివరికి అతని సర్వశక్తులూ స్వయంగా అతని వినాశానికే ఉపయోగపడతాయి.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)

తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

(కితాబుత్తఫ్సీర్)

**అర్రహ్మాన్, అర్రహీమ్** – ఇవి రెండూ అల్లాహ్ గుణాలు. ఇవి రెండూ 'రహ్మత్' నుండి వెలువడ్డాయి. ఈ రెండింటి అర్థం దాదాపు ఒక్కటే. అంటే అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అని అర్థం. అంటే 'అలీమ్', 'ఆలిమ్' అనే పదాలు రెండింటికీ అర్థం లాంటిదే ఇదీను.★ (అంటే ఎరిగిన వాడు, తెలిసినవాడు).

## 1. ఫాతిహా సూరా వ్యాఖ్యానం

ఈ సూరాను **'ఉమ్ముల్ కితాబ్'** అని కూడా అంటారు. 'ఉమ్మ్' అంటే తల్లి, మాత అని అర్థం. ఎందుకంటే దివ్య ఖుర్ఆన్ ఈ సూరాతోనే ఆరంభమవుతుంది. నమాజ్‌లో కూడా పారాయణం ఈ సూరాతోనే మొదలవుతుంది. **'అద్దీన్'** అనేది ఈ సూరాలోని కీలకమైన పదం. అద్దీన్ అంటే 'ప్రతిఫలం' అని అర్థం– అది మంచిదీ కావచ్చు, చెడ్డదీ కావచ్చు. 'చేసుకున్న దాని ప్రకారం పొందుతారు' అన్న నానుడి సుప్రసిద్ధమే. 'అద్దీన్' అంటే లెక్కతేల్చే దినం అని ముజాహిద్ అంటారు. అల్ మావూన్ సూరాలోని మొదటి ఆయత్ ఆధారంగా ఆయన దీనిని 'శిక్షా బహు మానాల దినం'గా పేర్కొన్నారు. **"కల్లా బల్ తుకజ్జిబూన బిద్దీన్"** (మీరు శిక్షా బహుమానాలు లేవని తిరస్కరిస్తున్నారు– అల్ ఇన్ఫితార్: 9) అనే వాక్యాన్ని కూడా ఆయన తన వ్యాఖ్యానానికి ఆధారంగా తీసుకున్నారు.

**325)** అబూ సయీద్ బిన్ ముఅల్లా (రజి) వివరించారు: నేను మస్జిద్‌లో నమాజ్ చేస్తూ ఉండగా ప్రవక్త మహనీయులు(సఅసమ్) నన్ను పిలిచారు. కాని నేను జవాబు ఇవ్వలేదు. (నమాజ్ అనంతరం నేను ఆయన సన్నిధిలో హాజరై) 'దైవప్రవక్తా! నేను నమాజ్‌లో ఉన్నాను' అని విన్నవించుకున్నాను. దానికి దైవప్రవక్త(స) "ఏమిటి, అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి (అల్ అన్ఫాల్: 24)[1] అని అల్లాహ్ సెలవీయలేదా?" అని అడిగారు. తరువాత ప్రవక్త మహో

★ కొంతమంది ఏమంటారంటే **'రహ్మాన్'**లో అతిశయోక్తి ఉంది. అందుకే **'రహ్మానుద్దునియా వ రహీముల్ ఆఖిరా'** అంటారు. ఎందుకంటే ప్రపంచంలో ఆయన కారుణ్యం అందరిపై సాధారణంగా ఉంటుంది. పరలోకంలో మాత్రం అది విశ్వాసులకే ప్రత్యేకం. మరి కొందరేమంటారంటే **'రహ్మా'** (దయ)లో అతిశయోక్తి ఉంది. హాఫిజ్ ఇబ్నె హజర్ ప్రకారం రెండింటిలోనూ ఒకింత (ఒక్కో కారణంగా) అతిశయోక్తి ఉంది.

అబ్దుల్లాహ్ బిన్ ముబారక్ (రహ్మా) ఇలా అంటారు: అర్థించినప్పుడు ఇచ్చేవాడు **రహ్మాన్.** అర్థించకుండా ఉండటంపై అప్రసన్నుడయ్యేవాడు **రహీమ్.** అల్లాహ్ యొక్క అపారమైన కృప ఏమిటంటే అడగటం పట్ల

దయులు(స) ఇలా ప్రవచించారు: "మస్జిద్ నుండి వెడలక ముందే ఈ రోజు నేను నీకు ఒక సూరా గురించి చెబుతాను. అది పుణ్యఫలం రీత్యా ఖుర్ఆన్‌లోని సూరాలన్నింటిలోకీ గొప్పది". ఆయన(స) నా చేతిని తన చేతిలోకి తీసుకుని, మస్జిద్ నుండి బయటికి వెళుతుండగా, 'దైవప్రవక్తా! మస్జిద్ నుండి వెడలక ముందే నీకు ఒక సూరా గురించి చెబుతాను. అది పుణ్యఫలం రీత్యా ఖుర్ఆన్‌లోని సూరాలన్నింటిలోకీ గొప్పది అని తమరు అంటిరి కదా!' అని నేను విన్నవించుకున్నాను. దానికి ఆయన(స), "అదే అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్ సూరా. అందులో ఏడు ఆయత్‌లు ఉన్నాయి. (అవి ప్రతి రకఅత్‌లో పునరావృతం అవుతుంటాయి) నాకు ప్రసాదించబడిన గొప్ప ఖుర్ఆన్ (ఫాతిహా సూరా) ఇదే" అని చెప్పారు.

### అధ్యాయం : 2

## 'గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్' అన్న దైవ వచనానికి వివరణ

**326) హ్రజత్ అబూ హురైరా(రజి) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసమ్) ఇలా ఉద్బోధించారు: "(నమాజులో) మీ నాయకుడు (ఇమామ్) 'గైరిల్ మగ్‌జూబి అలైహిమ్ వలజ్జాల్లీన్' అని పలికినప్పుడు మీరు 'ఆమీన్' అని అనండి. ఎందుకంటే ఈ విధంగా (ఆమీన్) పలికిన వాని పలుకు దైవదూతల పలుకుతో అనుసంధానమై, అతని వెనుకటి పాపాలన్నీ క్షమించబడతాయి."**

ఆయన ప్రసన్నుడవుతాడు. అడగకుండా ఉండటం పట్ల అప్రసన్నుడవుతాడు. ఓ రాజాధిరాజా! మేము నిన్ను అర్థించటం వినా మార్గాంతరం లేదు. మేము ఇహంలోని మేలు, పరంలోని సాఫల్యం కొరకు నిన్ను అర్థిస్తూ వుంటాము.

325-1. ఈ ఆయత్ ఆధారంగానే, దైవప్రవక్త(స) పిలుపుపై వెంటనే హాజరవ్వాలని విద్వాంసులు ఉద్ఘాటించారు. నమాజు స్థితిలో ఉన్నా సరే ఆలస్యం చేయరాదని అన్నారు. అలా హాజరవటం వల్ల నమాజ్ భగ్నమవుతుందా? లేదా? అన్న దానిపై అభిప్రాయ భేదం ఉంది. నమాజ్ వంటి ఆరాధనను సయితం విడిచిపెట్టి ప్రవక్త పిలుపునకు స్పందించాలన్న ఆదేశం ఉన్నప్పుడు జనులు దాని ప్రాముఖ్యతను ఆకళింపు చేసుకున్నారా? లేదా? అన్నది గమనించాల్సిన విషయం. ప్రజలు తమ షరీఅత్ అన్వయకర్తల (ముజ్తహిదీన్) పిలుపుపై వెళుతున్నారు. కాని దైవప్రవక్త(స) హదీసుల వైపునకు మరలటం లేదు. మరి చూడబోతే ఈ శాసనాన్వయకర్తల (ముజ్తహిదీన్ల) మాటను శిరసావహించటం ఫర్జ్ గానీ, సున్నత్ గానీ, నఫిల్ గానీ కాదు. కాని దైవప్రవక్త(స)కు విధేయత చూపటం ఖుర్ఆన్ ప్రకారం విధి (ఫర్జ్).

★★★

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# వయసు, సొగసు, మనసు అదుపులో ఉంటేనే శ్రేయస్సు

సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

గత సంచిక తరువాయి

### స్నేహభావంతో ఉండాలి

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావంతో ఉండాలి. తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్. పెద్దల పర్యవేక్షణను బట్టే పిల్లల నడవడిక ఉంటుంది. ఊహ తెలిసేంతవరకు పిల్లల ఆలనా, పాలన తల్లి చూస్తే ఊహ తెలిసే సమయం నుంచి తండ్రి శ్రద్ధ వహించాలి. పిల్లలకు స్వేచ్ఛ ఇస్తూనే బాధ్యతలు గుర్తెరిగేలా పెంచాలి. ఆంక్షలు పరిమితంగా ఉండాలి. పిల్లలు అన్ని విషయాలను మనసు విప్పి చెప్పుకునే వెసులుబాటు తల్లిదండ్రులు కల్పించాలి. ఇటీవల స్నేహాలు పెరిగాయి. తమ పిల్లలు స్నేహం చేసే వారిని గమనిస్తూ ఉండాలి. విద్యా ప్రమాణాలు మెరుగు పరిచే కోణంలో ర్యాంక్‌ల సాధన కోసం పిల్లలపై ఇపుడు తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఒత్తిడిని తట్టుకునే క్రమంలోనే స్నేహానికి ప్రేమ అనే ముసుగు వేసుకుంటూ పిల్లలు ఆకర్షణకు లోనవుతున్నారు. సరైన సమయంలో తల్లిదండ్రుల గైడెన్స్‌తోనే పిల్లలు సక్రమ మార్గంలో నడిచే వీలుంటుంది. సాంకేతికత ఎంత మేలు చేస్తుందో అంత కీడు చేస్తుంది. కాబట్టి స్మార్ట్ ఫోన్‌లు, టీవీల వీక్షణ వద్ద పిల్లలను పరిమితంగా ఉండేటట్లు చూడాలి.

హజ్రత్ అమ్ర్ బిన్ షుఐబ్ తన తండ్రి నుండి, ఆయన తన తాత నుండి చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఇలా ఉద్బోధించారు : మీ పిల్లల్ని ఏడు సంవత్సరాల ప్రాయం నుండే నమాజు చెయ్యండని ప్రోత్సహిస్తూ ఉండండి. పది సంవత్సరాల తరువాత (కూడా వారు నమాజు పట్ల నిర్లక్ష్యం వహిస్తే) వారిని శిక్షించండి. వారి పడకల్ని వేరుపరచండి. (సుననె అబూదావూద్)

**1) వ్యక్తిగత స్వతంత్రత :** పడకల్ని వేరు చేయడం వల్ల వారి స్వంత నిద్ర స్థలాలను అనుమతించడం, వారి పెరుగుతున్న స్వతంత్రతను గుర్తించినట్టు అవుతుంది.

**2) నిద్రస్థలాల విభజన :** చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మొదట తల్లి దగ్గర పడుకుంటారు. తల్లి తండ్రి మీద కాలు వేసుకుని పడుకుంటారు. కొంచెం పెద్దయ్యాక పిల్లలు వేరే గదిలో పడుకుంటారు. తల్లిదండ్రి వేరే గదిలో ఉంటారు. పిల్లలు చదువుకుని అక్కడే పడుకుంటారు. అలా కుదరని పక్షంలో - ప్రతి పిల్లవాడికి వేరుగా పడుకునే స్థలాన్ని కేటాయించాలి. ఒకే గదిలో పడుకోవాల్సి వచ్చినా కనీసం మధ్యలో తెరలు లేదా ఇతర ఏర్పాటు చేయాలి అని పండితులు సూచిస్తున్నారు.

**12వ ఏట :** ప్రాజ్ఞ వయసు అనగా 10-12సంవత్సరాల నుండి పిల్లలలో హార్మోన్స్ ప్రభావం మొదలవుతుంది వాళ్లలో ఆర్గాన్స్ పెరుగుతూ ఉంటాయి. యవ్వన లక్షణాలు కనబడుతూ ఉంటాయి. ఆడపిల్లలు- మగ పిల్లలు ఆకర్షణ అప్పుడే స్టార్ట్ అవుతుంది. అలాంటి టైంలో ఒకే తల్లి తండ్రి పిల్లలు అయినాగాని ఒకే ఒక మంచం మీద పడుకోకూడదు. ఎందుకంటే, ఆడతనం మగతనం కోరికలు అప్పుడే మొదలవుతాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకే మంచం మీద పడుకోవడం వల్ల ఒకరి మీద ఒకరు కాళ్లు వేయుట, మీద పడుట జరుగుతూ ఉంటుంది. ఈ వయస్సులో పిల్లలు శృంగార భావనలు గుర్తించగల స్థితికి వస్తారు. అందుకే ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

ఈ ఆదేశం అబ్బాయిలకే కాదు, అమ్మాయిలకూ వర్తిస్తుంది. ప్రతి ఒక్కరికీ వేరే పడక ఏర్పాటు చేయలేనప్పటికీ, కనీసం తెరలు లేదా గదిలో విభజనలు ఏర్పాటు చేయడం ద్వారా ఈ మార్గదర్శకాన్ని అనుసరించవచ్చు.

ఇక మొక్కై వంగనిది మానై వంగదు అని ఏనాడో మన పెద్దలు సామెత చెప్పారు. ఎందుకంటారు? చిన్ననాటి నుంచి సద్గుణాలను అలవర్చుకోవడానికి.. కష్టపడే స్వభావం నేర్చుకోవడానికి, మంచితనంతో మెలగడానికి!! కోట్లు సంపాదించుకోవచ్చు, కోరినన్ని సాధించుకోవచ్చు. నిజాయితీగా సాధించుకున్నవి సంపాదించుకున్నవి ఎనలేని సంతృప్తినిస్తాయి. వెనుతిరిగి చూసుకుంటే మనం ఎక్కడున్నామో తెలియజేస్తాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మన్యూనతకు గురికానటువంటి ప్రవర్తన, అధికార దాహం లేని సద్భావం మనిషిని ఎవరెస్ట్ శిఖరమంత ఉన్నత స్థానంలో నిలబెడతాయి.

## మనసు

"నేను నా మనసు నిర్దోషిత్వాన్ని గురించి గొప్పలు చెప్పుకోవడం లేదు. మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపునకే పురిగొల్పుతుంది. నా ప్రభువు కారుణ్యభాగ్యం లభిస్తే తప్ప. నా ప్రభువు గొప్ప క్షమాశీలి, అమిత దయామయుడు." (యూసుఫ్: 53)

**1. మనసు ఒక శక్తివంతమైన సాధనం :** మనస్సు అనేది ఒక శక్తివంతమైన సాధనం, ఇది వ్యక్తి జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి, లక్ష్యాలను సాధించడానికి, సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి ఉపయోగపడుతుంది.

**2. మనస్సును నియంత్రించడం ముఖ్యం :** మనస్సు మన ఆలోచనలు, భావోద్వేగాలను ప్రభావితం చేస్తుంది. మనస్సును నియంత్రించడం వలన, మనకు మంచి అనుభూతి కలిగేలా చేసుకోవచ్చు, మన జీవితంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చు.

**3. మనస్సును నిర్మలంగా ఉంచుకోవడం అవసరం :** మనస్సును శుభ్రంగా ఉంచుకోవడం అంటే, ప్రతికూల ఆలోచనలు, భావోద్వేగాలను వదిలిపెట్టి, సానుకూల ఆలోచనలు, భావోద్వేగాలను పెంపొందించుకోవడం.

## మూడు ఆపదలు, మూడు పరిష్కారాలు

మనస్సును ముట్టడించి మనిషిని మట్టి కరిపించే మూడు ఆపదలకు మూడు పరిష్కారాలు :

**మొదటి ఆపద :** మీరు మనోవాంఛల దాస్యానికి, కామకోరికలకు ఎక్కువ ఆకర్షితులవుతే, పరిష్కారంగా మీకు మీ నమాజ్ (ప్రార్థనలు) పట్ల ఉన్న శ్రద్ధను తిరిగి సమీక్షించుకోండి!

**రెండవ ఆపద :** మీకు దుఃఖంగా, అసంపూర్ణంగా, వెలితిగా, ఏదో కోల్పోయినట్టుగా అనిపిస్తే... సత్కార్యాలు చేసుకునే సద్బుద్ధి మీకు కలగడం లేదు అంటే.. మీలో హృదయ కాఠిన్యత చేరుకుందనిపిస్తే, పరిష్కారంగా- మీకు మీ తల్లితో ఉన్న సంబంధాన్ని సమీక్షించుకోండి!

**మూడవ ఆపద :** మీకు డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి అనిపిస్తే... పరిష్కారంగా మీకు ఖుర్ఆన్తో ఉన్న సంబంధాన్ని సమీక్షించుకోండి!

## అల్లాహ్ శిక్ష నుండి మనల్ని మనము కాపాడుకోవాలి

విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. దానికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు. అక్కడ దృఢకాయులైన, కఠిన (హృదయులైన) దైవదూతలు (నరక నిర్వాహకులుగా) నియమితులై ఉంటారు. వారు అల్లాహ్ ఆజ్ఞల్ని ఏమాత్రం జవదాటరు. ఏ ఆజ్ఞ వచ్చినా తక్షణమే దాన్ని శిరసావహిస్తారు. (వారు నరక వాసులతో) "అవిశ్వాసులారా! ఈ రోజు మీరు సాకులు చెప్పకండి. మీరెలాంటి కర్మలు చేసుకున్నారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది" అనంటారు. (అత్-తహ్రీమ్: 6-7)

ఒకసారి కొందరు ఒక సౌమ్యుడయిన దైవభీతిపరుణ్ణి ఓ గుహ సమీపంలో చూసారు. అతనిని పిలిచారు, కానీ ఆయన స్పందించలేదు. రెండోసారి పిలిచారు. అప్పుడు ఆ ధర్మ పరాయణుడు బయటకు వచ్చి ఇలా అన్నాడు: "అయ్యా! నన్ను క్షమించండి, నేనేమీ మీరనుకున్నంత గొప్ప వ్యక్తిని కాను. నిజమైన దైవభీతి పరుడంటే- ఆకాశాలలో వున్న అల్లాహ్ మహిమను, గౌరవాన్ని గుర్తించి, ఆయన భయంతో జీవించేవాడు. అల్లాహ్ తీర్పును సంతోషంగా అంగీకరించేవాడు, ఆయన అనుగ్రహాలకు కృతజ్ఞతతో ఉండేవాడు, ఆయన కఠిన శిక్షకు కంపించి పోయేవాడు. నిజమైన దైవభీతిపరుడు ఎలా ఉంటాడంటే, అతని పగలు ఉపవాసంతో, రాత్రిపూట ప్రార్థనతో గడుస్తుంది. నరకం గురించిన చింత, సృష్టికర్త అయిన అల్లాహ్ విచారణ అతనిని నిద్రలేకుండా చేస్తాయి. అలాంటి ఉత్తమ లక్షణాలు గలవాడే నిజమైన దైవభక్తి పరుడు. నేను కాదు. నేను అయితే పిచ్చి కుక్కను పోలి ఉన్నాను. ఈ గుహలో ఉంటూ, ఇతరులను గాయపరచకుండా ఉండేందుకు నన్ను నేనే నిర్బంధించుకున్నాను" అని చెప్పి ఆ గుహలోనికి వెళ్లి పోయాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

విశ్వాసులారా! మీరు మనస్ఫూర్తిగా అల్లాహ్‌ను క్షమాపణ కోరుకోండి. మీ ప్రభువు మీ పాపాలు మన్నించి, మిమ్మల్ని సెలయేరులు పారే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు.

(అత్-తహ్రీమ్: 8)

## ప్రాపంచిక జిలుగు వెలుగులు చూసి మోసపోకూడదు

పూర్వం ఒక గుహలోకి వెళ్లిన ఓ మహాత్ముని ఓ అద్భుత దృశ్యం తారస పడింది. ఆయన ఆ గుహలో తొంగి చూసినప్పుడు, అతి గొప్ప ఆకారంలో ఉన్న ఒక మనిషి అక్కడ ఉన్నాడు. ఆ వ్యక్తి తలవైపు ఒక రాయి ఉంది. అందులో ఇలా వ్రాయబడి ఉంది: "నేను వసీం, గొప్ప నైపుణ్యం గలవాడిని. నేను వెయ్యేళ్ళు ఈ లోకాన్ని పాలించాను. వెయ్యి నగరాలను అధీనంలోకి తెచ్చు కున్నాను. వెయ్యి సైన్యాలను ఓడించాను. రాజకుమార్తెలలో వెయ్యి మందిని పెళ్లి చేసుకున్నాను. వెయ్యి మందిని (అహంకారంతో ఉన్న వీరులను, ధురంధరులను) చంపాను. నన్ను చూసినవారు ఈ లోకం మాయలో పడకండి. ఎందుకంటే ఇది కేవలం నిద్రలో కనే కలలాగానే ఉంది. ఆ కల కల్లవడానికి ఎక్కువ సమయం పట్టదు. చివరికి నా లాంటి వ్యక్తి పరిస్థితేంటో చూడండి- కటిక నేలే నా మంచం, రాళ్లే నా తలగడ. కాబట్టి నన్ను చూసినవారు ఈ లోకం మత్తులో పడకండి., ఎందుకంటే ఈ లోకం నన్ను మత్తులో పడేసి చిత్తుచిత్తుగా ఓడించి చివరికి దేనికీ పనికిరాని చెత్తగా చేసింది.

**మానవులారా! అల్లాహ్ వాగ్దానం సత్యమయినది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించకూడదు. ఆ మహా మోసగాడు కూడా మిమ్మల్ని మోసగించకూడదు సుమా! షైతాన్ మీకు బహిరంగ శత్రువు. కనుక మీరు కూడా వాడ్ని శత్రువుగానే పరిగణించండి. వాడు తన అనుచరుల్ని నరకవాసుల్లో కలిపేయడానికి తన మార్గం వైపు పిలుస్తున్నాడు. అవిశ్వాసులకు కఠినశిక్ష పడుతుంది. సత్యాన్ని విశ్వసించి, సదాచార వైఖరి అవలంబించేవారికి మన్నింపుతోపాటు గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. (ఫాతిర్: 5-7)**

## చివరి మాట:

ఉరుకులు, పరుగులు, అలసట, ఆందోళన... వీటితో సహజీవనం సాగిస్తున్నాం. సమస్య ఆవగింజంతైనా దాన్ని భూతద్దంలోంచి పనసకాయంత పరిమాణంలో చూస్తున్నాం. అయితే, జీవితం అంటేనే అంతులేని పోరాటం. ఎన్ని సమస్యలు ఎదురైనా వాటినుంచి విముక్తి పొందేందుకు ప్రయత్నించాలి. అందుకు 'ధ్యానం' (జిక్ర్), పవిత్ర గ్రంథ పారాయణం తోడ్పడుతుంది. దాని ద్వారా ఆరోగ్యం, ధైర్యం, దూరదృష్టి, తెలివితేటలు, సామర్థ్యం... ఈ లక్షణాలన్నీ అలవడతాయి. విజయానికి దగ్గర చేస్తాయి. రోజుకో ఆపిల్ తింటే వైద్యుడి అవసరం రాదన్న చందాన, మనో రుగ్మత, మానసిక రోగం- ధ్యానం, జిక్ర్ చేసేవారి, పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేసేవారి దరి చేరదు. పైగా ఏకాగ్రత ప్రశాంతతను ఇస్తుంది. మౌనసాధన వల్ల ఆచితూచి మాట్లాడటం అలవడుతుంది. స్నేహం, ప్రేమ, కరుణ పెంపొందుతాయి. నిద్రాణమై ఉన్న శక్తిసామర్థ్యాలు వెలికి వస్తాయి. శత్రువును కూడా మిత్రుడిగా మార్చుకోగల శక్తి ధ్యానం, ఖుర్ఆన్ పారాయణం ద్వారా సిద్ధిస్తుంది.


### చందాదారులకు విజ్ఞప్తి

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**




# భారత జాతీయోద్యమంలో ముస్లింల భాగస్వామ్యం

**భారతీయులకు జాతీయ పర్వదినాలు రెండు. ఒకటి స్వాతంత్ర్య దినోత్సవం. రెండవది గణతంత్ర దినోత్సవం.** ఒకటి ఆంగ్లేయుల కబంధ హస్తాల నుండి మనకు విముక్తి లభించిన రోజైతే, మరొకటి భారత రాజ్యాంగం అమల్లోకొచ్చిన రోజు.

భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యోద్యమం ఒక మహోజ్వల ఘట్టం. మనమీరోజు ఇంతహాయిగా స్వేఛ్ఛావాయువులు పీలుస్తున్నామంటే, దీని వెనుక అసంఖ్యాకమంది అమరుల త్యాగాలున్నాయి. హిందూ, ముస్లిం అన్న భేదభావం లేకుండా భారతీయులందరూ కలసి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. భారతదేశ స్వాతంత్ర్య సముపార్జనలో ఎవరి పాత్రా తక్కువ కాదు, ఎక్కువ కాదు. అందరూ ఐక్యంగా, భారతీయులుగా మాత్రమే ఆంగ్ల మూకలను తరిమికొట్టారు.

కాని గత కొంతకాలంగా భారత స్వాతంత్ర్యోద్యమంతో నామమాత్రపు సంబంధం కూడా లేని కొన్ని శక్తులు భారతీయ ముస్లింల దేశభక్తిని శంకించే స్థాయికి చేరుకున్నాయి. నిజానికి భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లింలు పోషించిన పాత్ర అనుపమానమైనది, అపూర్వమైనది. అసలు స్వాతంత్ర్యోద్యమానికి బీజం వేసిందే వారు. 1857కు వందేళ్ళ పూర్వమే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించారు. మొట్టమొదట షా వలివుల్లా ముహద్దిస్ దహెల్వీ రహిమహుల్లా ఆంగ్ల ముష్కరుల కుట్రలను పసిగట్టి, ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వారసత్వాన్ని అంది పుచ్చుకున్న ఆయన కుమారులు ఆంగ్లమూకకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ‘జిహాద్’ చేయాలని దేశంలో మొట్టమొదట ఫత్వా జారీ చేసింది షా వలియుల్లా కుమారుడు షా అబ్దుల్ అజీజ్ జహీమాబాదీ. తరువాత అలీ వర్దీ ఖాన్ బెంగాల్ , ముర్షదాబాద్ ప్రాంతాల్లో ఆంగ్లేయులను ఢీకొన్నాడు. 1757లో వర్దీఖాన్ మనవడు, బెంగాల్ నవాబ్ , పాతికేళ్ళ యువకిషోరం సిరాజుద్దౌలా ఆంగ్ల ముష్కరులపై విరుచుకుపడ్డాడు. 1766లో మీర్ ఖాసిం బ్రిటిష్ బలగాలతో తలపడ్డాడు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి వ్యతిరేకంగా మంజూషా నాయకత్వంలో ముస్లిం ఫకీర్లు తిరుగుబాటు ఉద్యమాన్ని ప్రారంభించారు. భవానీపాఠక్ నాయకత్వంలో హిందూ సన్యాసులు కూడా వీరికి తోడయ్యారు.

అందుకే ఈ ఉద్యమం 'ఫకీర్లు, సన్యాసుల ఉద్యమం'గా ప్రసిద్ధి గాంచింది. 1780లో మన విశాఖపట్నంలోని ఈస్టిండియా కంపెనీలో సూబేదారుగా పనిచేస్తున్న షేఖ్ అహ్మద్‌ను మైసూరుపై దండెత్తమని అక్కడి ఆంగ్ల అధికారులు ఆదేశించారు. కాని ఆయన వారి ఆదేశాలను బేఖాతరుచేసి, తన మద్దతుదారులతో కలిసి ఈస్టిండియా సైన్యంపైన్నే కాల్పులు జరిపాడు మొట్ట మొదటి సైనిక తిరుగుబాటుదారుడు షేఖ్ అహ్మద్.

ఉత్తరాదిన ప్లాసీ, బక్సర్ యుద్ధాలతో తమ కబ్జాను పటిష్టం చేసుకొని, బెంగాల్ సంస్థానాన్ని హస్తగతం చేసుకున్న ఆంగ్లేయులు, తమ దృష్టిని దక్షిణాది వైపు మళ్ళించారు. వీరి దుష్టబుద్ధిని, రాజ్యా కాంక్షను పసిగట్టిన శతృభయంకరుడు, దక్షిణ భారతదేశ నెపోలియన్‌గా పేరుగాంచిన సయ్యద్ హైదర్ అలీ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా మాతృదేశ రక్షణకోసం కంకణబద్ధుడై వారితో యుద్ధానికి దిగాడు. 1769లో జరిగిన ఈ యుద్ధాన్ని ప్రథమ మైసూరు యుద్ధం అంటారు. ఈ యుద్ధంలో ఆంగ్లేయులు గత్యం తరం లేక హైదర్ అలీతో సంధి కుదుర్చుకున్నారు. తరువాత హైదరలీ కుమారుడు టిప్పుసుల్తాన్ ఆంగ్లేయుల రాజ్యవిస్తరణా కాంక్షపై నీళ్ళుచల్లుతూ, వారితో పోరాటానికి దిగాడు. వారితో పోరాడుతూనే, స్వదేశీ పాలకులందరూ,' ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో తనతో కలసిరావాలని ఉత్తరాలు రాశాడు. ఈ విషయంలో ఆంగ్లాధికారులు మాట్లాడుతూ, 'స్వదేశీ పాలకులు టిప్పుసుల్తాన్ లేఖలకు స్పందించి, ఆయన మాటను గౌరవించి ఉంటే, ఈనాడు భారతదేశంలో మేము పాలకులుగా ఉండేవాళ్ళమే కాము' అని నిర్ద్వంద్వంగా ప్రకటించారు. చివరికి 1799 మే 4 వ తేదీన ఆంగ్ల బలగాలతో పోరాడుతూ టిప్పూ అమరగతి పొందాడు. బ్రిటిష్ అధికారి జనరల్ హారీ టిప్పుసుల్తాన్ శవాన్ని స్వయంగా పరిశీలించి, మరణించాడని నిర్ధారించుకున్న తరువాత మాత్రమే 'ఈ రోజు నుండి భారతదేశం మాది' అని ప్రకటించే సాహసం చేయగలిగాడు. అంటే ఆంగ్ల మూకలకు ఈ మైసూరు పులి ఎంతటి సింహస్వప్నంగా నిలిచాడో అర్థం చేసుకోవచ్చు.

టిప్పు తరువాత 1857లో చివరి మొగల్ చక్రవర్తి బహద్దూర్ షా జఫర్ మాతృదేశాన్ని రక్షించుకోడానికి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించాడు. అడుగడుగునా ఆంగ్లేయులతో పోరాడుతూ కంట్లో నలుసులా మారిన బహద్దూర్ షా జఫర్‌ను ఎలాగైనా నిలువరించాలని బ్రిటిషర్లు పథకం రచించి ఎట్టకేలకు ఆయన్ని బంధించగలిగారు. ఆయన కళ్ళముందే ఆయన నలుగురు కుమారుల్ని అత్యంత అమానుషంగా కుత్తుకలు కోస్తూ, ఇప్పటికైనా మనసు మార్చుకొని తమకు సహకరించమని గర్జించారు. కాని జఫర్ పితృప్రేమతో పొంగుకొస్తున్న పుట్టెడు దుఖాన్ని పంటి బిగువున భరిస్తూ, దైవంపై భారమేసి కళ్ళు మూసుకున్నాడు తప్ప, దేశ ప్రేమలో వీసమెత్తు తేడా కూడా రానీయలేదు. దీంతో బ్రిటిష్ సైనిక మృగాలు కొడుకుల తలలను మొండాల నుండి వేరుచేసి తండ్రి ముందుంచారు. తరువాత ఆయన్ని బర్మాలోని రంగూన్ జైలుకు తరలించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టిన అసంఖ్యాక మంది ముస్లిం యోధుల్లో మన హైదరాబాదుకు చెందిన మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్, తుర్రెబాజ్ ఖాన్ ముఖ్యులు. కోఠీలోని బ్రిటిష్ అధికారుల నివాసాలపై దాడిచేసి ఆంగ్ల సైన్యానికి చుక్కలు చూపించిన వీరులు. వీరిని అత్యంత ప్రమాదకారులుగా గుర్తించిన ఆంగ్ల అధికారులు మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్‌ను అండమాన్ నికోబార్‌లోని 'కాలాపానీ' జైలుకు తరలించి చిత్రహింసలు పెట్టి చంపేశారు. తుర్రెబాజ్ ఖాన్ తూప్రాన్ గ్రామంలో ఆశ్రయం తీసుకుంటుండగా సమాచారం తెలిసిన పోలీసులు అరెస్టు చేయడానికి పన్నాగం పన్నారు. వారికి సజీవంగా దొరక కూడదని నిర్ణయించుకున్న ఖాన్ వారితో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందాడు.

ఈ విధంగా దేశం కోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేసిన ముస్లింలలో అనేక మంది మహిళలూ ఉన్నారు. బేగం హజ్రత్ మహల్, ఆబాదీబాను, ముందర్, బేగం రహీమా, బేగం హబీబా, అజ్గరిబేగం, సురయ్యా, అజీజున్, హమీదాబేగం లాంటి మరెందరో వీర నారీమణులు తమ జీవితాలను త్యాగం చేశారు. దేశ రక్షణ కోసం విదేశీయుల బారినుండి భారతదేశాన్ని కాపాడు కోవడం కోసం తమ జీవితాలనే త్యాగం చేసిన వారి గురించి ఈనాడు కొన్ని మతోన్మాద ఫాసిస్టు శక్తులు అవాకులు, చవాకులు పేలుతున్నాయి. ఆంగ్లేయుల శిక్షలకు భయపడి, తమను వదిలేస్తే భారత్‌కు వ్యతిరేకంగా, జీవితాంతం తమకు రుణపడి ఉంటామని ఆంగ్లేయుల అరికాళ్ళు నాకినవాళ్ళు ఈ రోజు దేశభక్తి సూక్తులు వల్లించడం విడ్డూరంగా ఉంది. చరిత్రను వక్రీకరిస్తూ, సోదర భావంతో కలసి మెలసి సామరస్యంగా సహజీవనం చేస్తున్న సోదర సమూహాల నడుమ మతపరమైన వైషమ్యాన్ని రెచ్చగొట్టి తమ ప్రయోజనాలు నెరవేర్చుకునే ప్రయత్నాలు బలంగా చేస్తున్నాయి. కనుక దేశంలోని ప్రజాస్వామిక, లౌకికవాద, మేధావి వర్గం వాస్తవ చరిత్రను భావితరాలకు తెలియ జెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# ఆదర్శపూర్వకమయిన విధి విధానాలు

- ఎస్.ఎమ్.మలిక్

## ముస్లిమ్ జీవితం

ఒక ముస్లిమ్ జీవితంలో ధార్మిక విధి నిషేధాలు, నైతిక విలువలు, జీవన పోకడలో నిజాయితీ భావన, నిజాయితీని కాపాడుకోవటం, నిజాయితీగా మనగలగడం అన్నీ చేరి ఉన్నాయి. ఎందుకంటే ఇవన్నీ అతనికి దైవం పక్షాన అప్పగించబడిన సకల బాధ్యతలకు ప్రతిరూపాలే. ముస్లిమ్ వ్యక్తి మానవుల హక్కులకూ బాధ్యుడే. వాటిలో తల్లిదండ్రుల హక్కులు, బంధుగణం హక్కులు, సమాజం హక్కులు, ఇంకా స్వయంగా తన వ్యక్తిత్వ హక్కు, అంతేకాదు, స్వయంగా తన బాధ్యతలో ఉన్న ప్రతి వస్తువు హక్కు- తన మీద తారసపడిన ఈ హక్కులన్నింటినీ అతను నెరవేర్చవలసి ఉంటుంది. వీటిలో తన ఇష్ట ప్రకారం మనిషి ఎటువంటి హెచ్చు తగ్గులూ చేయలేడు. ఈ హక్కులన్నింటినీ గుర్తించి, వీటి బాధ్యతల్ని అర్థం చేసుకుని దాని ప్రకారం అమలు పరచినవాడే నిజమయిన నిజాయితీ పరుడు!

దైవం పక్షంగా ఈ అప్పగింత, బాధ్యతా భావం, అదే విశ్వాసం. ఇస్లామ్, ఎంత ముఖ్యమయినదో, ఎంత భారీ అయినదో అవగత పరచడానికి దైవం తన గ్రంథం దివ్య కుర్ఆన్‌లో ఉపమానంగా ఇలా సెలవిచ్చాడు :

“మేము ఈ బాధ్యతా భారాన్ని ఆకాశాలు, భూమి, పర్వతాల సమక్షంలో పెట్టగా అవేవీ దాన్ని ఎత్తుకునేందుకు సిద్ధ పడలేదు, దాని బాధ్యత వహించడానికి భయపడ్డాయి, కాని మానవుడు దాన్ని ఎత్తుకున్నాడు. నిస్సందేహంగా అతను మహా మొండివాడు, మూర్ఖుడు.” (అల్ అహ్జాబ్ 33 : 72)

అంటే ఈ బాధ్యత, ఈ హోదా ఎంతో కఠినమయినది, భూమ్యాకాశాలు ఎంతో మహోన్నతమయినవే అయినప్పటికీ, పర్వతాలు ఎంతో గంభీర మహా కాయులయినప్పటికీ, ఈ అప్పగింతను వహించడానికి సాహసించ లేకపోయాయి. కాని మానవుడు తన తెలివి లేమి, మూర్ఖత్వం వల్ల తన అతి బలహీన భుజాలపైన ఎత్తుకున్నాడు.

దైవ విధేయుడయి లేదా పాపాతురుడయి జీవించే స్వేచ్ఛని చ్చాడు మనిషికి దైవం. ఆ స్వేచ్ఛే నిజానికి బాధ్యతా భావం, భారం.

## జీవన వ్యవస్థ

ఇస్లామ్ కేవలం సాధారణ పరిభాషలో ‘మత’ పరమయిన విషయాలనే బోధించదు, జీవితం మొత్తానికి, జీవితంలో ప్రతి విభాగానికి దారి చూపుతుంది. అది ఒక జీవన విధానాన్ని ప్రబోధిస్తుంది, దాన్నే జీవితంలో పాటించమంటుంది. ఓ రాజకీయ విధానాన్ని అందజేసి దాన్ని సామూహిక జీవితానికి మార్గదర్శిగా పాటించమంటుంది. పరిపాలన, యుద్ధం కూడా మానవ జీవితం లోని విభాగాలే, వాటికీ నియమ నిబంధనలు సూచిస్తుంది ఇస్లామ్. సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ, సవివరమ యిన బోధనలున్నాయి, వాటిని ముస్లిములు పాటించిన రికార్డు కూడా భద్రంగా ఉంది. ముస్లిమ్ విజేతల బాధ్యతలు ఏమిటీ అన్న కోణం కూడా యుద్ధ శాసనాలలో ఓ భాగమే.

ఒక సైనిక కమాండర్, అబూ ఉబైదా(ర) తన క్రింది సేనా నాయకులకు పంపిన నిర్దేశనలు చూడండి :

- ఒడంబడిక, ఒప్పందాలను చిత్తశుద్ధితో అమలు పరచాలి.
- హతుల చిత్రవధ (ముస్‌లా) చేయరాదు.
- పిల్లలు, మహిళలు, వృద్ధులు, సన్యాసులను బాధించరాదు, హత్య చెయ్యడం సుదూర విషయం.
- యుద్ధ ప్రాప్తిలో తస్కరం, ద్రోహం చోటు చేసుకోరాదు.

➢ ముస్లిములు, ముస్లిమేతరుల మిశ్రమ జనావాసాలపైన దాడి జరపరాదు.

➢ జనుల ఆస్తులు, పశువులను ముట్టుకోరాదు. వారి ఇండ్లల్లోకి తొంగి చూడరాదు.

➢ యుద్ధ ఖైదీలను వారి కుటుంబ సభ్యులతో (వారు కూడా ఖైదీలయిన పక్షంలో) వేరు చేయరాదు.

➢ బానిసల్ని ముట్టుకోరాదు.

ఇవి సిరియా, జోర్డాన్ కమాండర్, అబూ ఉబైదా(ర) ఇచ్చిన నైతిక నిర్దేశాలు. ఈయన కూడా అజ్ఞాన దశ దాటి ఇస్లామ్‌లోకి వచ్చిన వారే. ఇస్లామ్ విరోధ చరిత్ర కారులు ఇస్లామ్‌కు పూర్వపు అరబ్బుల దౌష్ట్యాలను చెడుల్ని ఇస్లామ్‌కు అంటగడతారు. కాని పైన పేర్కొన్న అరబ్బు ముస్లిమ్ కమాండర్ నిర్దేశాలు గమనార్హ మయినవి.

## బాధ్యతాభావం

ఒక సందర్భంలో పరాజిత ప్రాంతాల నిర్వహణ, రక్షణ నిమిత్తం ఏర్పాటయిన రక్షణ దళాలను అటు నుండి తిరిగి రప్పించుకునే అవసరం ఏర్పడినప్పుడు, తాము ముస్లిమేతరుల రక్షణ చేసే స్థితిలో లేమని గ్రహించి, స్వయంగా ఆ కమాండర్, ఆ ప్రాంతాల్లో రక్షణార్థం వసూలు చేసిన జిజ్యా, కప్పం గట్రా అక్కడి ముస్లిమేత రులకు తిరిగి చెల్లించవలసిందని తత్సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆ విధంగా సిబ్బంది వసూలు చేసిన రొక్కం తిరిగి చెల్లించడం చూసి అక్కడి ప్రజలు ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు. ఎందుకంటే సాధారణంగా ఇటువంటి సందర్భాల్లో తిరిగిపోయే సేన, సిబ్బంది పోతూ పోతూ ఇంకా దోచుకుపోవడమే ఆనవాయితీ!

వాస్తవానికి ఇస్లామ్ ఒక సంస్కరణాత్మక ఉద్యమం. అది నాగరిక, సాంస్కృతిక వ్యవస్థను ఆపాద మస్తకం పూర్తిగా సంస్కరించ గోరుతుంది. దాని గురించి కేవలం ఊహల్లో, ఊహాజనిత ఆలోచనల్లో విహరిస్తే సరిపోదు. ఆచరణాత్మక జగతిలోకి వెళ్ళి వాస్తవాలను అన్వేషించవలసి ఉంటుంది. ముస్లిమ్ సైనికుల యినా సేనాధిపతులయినా సంస్కరణాత్మక ఉద్యమం కార్యకర్తలే. వారు కత్తులూ కటారులూ లేకుండానే, చేదు మందులు లేకుండానే అసంఖ్యాక నైతిక రోగుల చికిత్స చేయగలిగారు.

ఇస్లామ్ వృద్ధీ వికాసాల కారణాలను వెతికినట్లయితే ఇస్లామ్ ఆవిర్భవించిన తొలి రోజుల్లో లక్షలాది జనులు ఇస్లామ్‌లోని సత్యతా మాధురిని గ్రోలి దానికి దాసోహం అన్నారు. వాస్తవం ఏమంటే ఆ తరువాత అయినా, దానికి ముందు అయినా భూమ్యాకాశాలు అటువంటి ఘటనలు ఎన్నడూ చూడలేదు. అవి కేవలం ఆనాటి పరిశుద్ధ మానవుల జీవితాల నుంచి మాత్రమే ఉదయించాయి. వారి సత్యతా సుగంధం ఆ వాతావరణాన్ని పూర్తిగా పరిమళ భరితం చేసివేసింది.

## నిజాయితీ తత్పరత

వారి నిజాయితీ తత్పరత ప్రభావం ఆనాటి ప్రపంచాన్నే మార్చి వేసింది. ఈ వాస్తవికత, వారి పరిశుద్ధత, సద్వర్తనలు సహజంగానే వారి కొరకు విజయ ద్వారాలు తెరచి వేశాయి. జిమ్మీలు ముస్లిముల నిజాయితీ, వాగ్దాన పాలన, వ్యవహార సరళిని గమనించి, వారు ముస్లిముల శత్రువులకు శత్రువులుగా, వారి విరోధులకు విరోధులుగా రూపొందారు. ముస్లిముల సహాయ కులుగా, సమర్థకులుగా మారడంలో జాగు చెయ్యలేదు.

ఒకానొక ప్రాంతాన్ని జయించిన తరువాత, సహచర మాన్యులు ప్రోగయిన యుద్ధ ప్రాప్తిని తెచ్చి కుప్పగా వేశారు. అప్పుడు ఆనాటి సైనిక కమాండర్ ఇన్ చీఫ్, మహనీయ అబూ ఉబైదా(ర) నిలబడి ప్రసంగించారు :

“ఇస్లామ్, ముస్లిముల వృద్ధీ వికాసాలు, మనం సత్య మార్గాన ఉన్నంత వరకే కొనసాగుతాయి. కాని ఒకవేళ సత్యం మనకు దూరమయినట్లయితే, నిజాయితీకి మనం దూరమయి, విద్రోహానికి పాల్పడినట్లయితే చూడలేని విషయాలు కానవస్తాయి. ఎంత అధికమయినా అల్పంగానే అగుపడుతుంది, ఎంతయినా సరిపోదు.”

జిజ్యా వసూలు చేయడంలో ఎటువంటి ఒత్తిడి చేయడం జరిగేది కాదు. ఒక సందర్భంలో, ఒక చోట కొందరిని కట్టి వేసిన దృశ్యం చూసి అడిగారు ముస్లిముల నాయకమాన్యుడు, వీరు చేసిన నేరం ఏమిటీ అని. “వీరు జిజ్యా ఇవ్వడం పట్ల తాత్సారం చేస్తున్నారు” అని సమాధానం వచ్చింది. ఆయన, “వీరి పట్ల ఈ వైఖరి సరయినది కాదు. దైవప్రవక్త (స), ‘ప్రపంచంలో జనులను బాధించే వారిని దైవం పరలోకంలో బాధలకు గురి చేస్తాడు’ అని చెప్పగా విన్నాను” అని సావధాన పరిచారు.

## పరుల సాక్ష్యం

ఫ్రెంచ్ వైద్యుడు, సామాజిక శాస్త్ర వేత్త, మనస్తత్వ శాస్త్రవేత్త, తత్వ శాస్త్ర వేత్త, ‘గుస్తావ్ లే బాన్’ (Gustave Le Bon) (1841-1931) తన పుస్తకం La Civilisation des Arabes (The World of Islamic Civilisation = అరబ్బుల నాగరికత) లో ఇలా వ్రాశాడు :

“మనం ముస్లిముల తొలి రోజుల్లోని అరబ్బుల విజయాలను పరిశీలిస్తూ మన అంతర్యాలను ఎటువంటి పక్షపాతాన్ని దగ్గర రానివ్వకుండా ఉన్నట్లయితే, ఓ నిర్ణయానికి వస్తాము, ఆనాడు ముస్లిములు ఎదుర్కొన్నది తమకన్నా ఎన్నో రెట్లు అధిక సైనిక బలం, ఉత్తమ శ్రేణి ఆయుధ బలం, కొన్ని సందర్భాల్లో ఇరుపక్షాల బల నిష్పత్తి ఒకటికి ఇరువై ఉండేది. అయినా ఆశ్చర్యం కలుగుతుంది, ముస్లిమేతరులు ఎన్నడూ విజయం సాధించరు. కాని కాస్త లోతుగా పరిశీలిస్తే ఆశ్చర్యం ఇట్టే తొలిగి పోతుంది, రోమనులయినా ఈరానీయులయినా ఉభయులూ నైతికంగా ఎంతో బలహీనులు. ఇటువంటి వారి సంకల్పబలం కూడా ఎంతో దిగజారిపోతుంది. ఈ బలహీనత వల్ల వారు ఎన్నడూ ఆధిక్యత పొందలేకపోయారు.

“అరబ్బు సేనలు ప్రారంభంలో సిరియా వైపునకు ముందడుగు వేసినప్పుడు వారికి బాజన్టయిన్ సేన ఎదురయింది. వీరు ఎటువంటి ఆశయం లేని మందకు సమానం. వారిలో ప్రాణాల ర్పించే ఉత్సాహం లేదు. వారికెదురుగా అరబ్బులను గమనిస్తే, తాము సత్య పథాన ఉన్నామన్న విశ్వాసం, తామే దాన్ని కాపాడగలమన్న ధీమా వారిలో మెండుగా ఉండేది. ఆ సత్యాన్ని ఇతరుల వరకు చేరవేసే బాధ్యత తమపైనే ఉందన్న భావం, ఇదే తమ జీవన ధ్యేయం అన్న నమ్మకం, అలా దాని కొరకు దేనినయినా ఎదురొడ్డి ప్రాణాలర్పించడమే దైవ ప్రసన్నతకు హేతువన్న వారి నమ్మకం వారిని సకల త్యాగాలకు సన్నద్ధ పరిచేది! దైవ ప్రసన్నతా గృహం అనంత సౌఖ్యాలకు నిలయం అన్నది వారి దృఢ విశ్వాసం! ఈ విశ్వాసం వారి ఉద్వేగ ఉద్రేకాలను అమితంగా ప్రభావితం చేసింది. ఇక ఎదురయిన ఆశయ శూన్యులయిన మూకను ఛిన్నాభిన్నం చేయడంలో వారికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు.”

## నిష్పక్షపాత దృష్టి

ఇంకా లే బాన్ ఇలా వ్రాశాడు:

“ఇతర మతాలన్నింటితో ఇస్లామ్, వైజ్ఞానిక శాస్త్రీయ ఆవిష్కరణ లకు చక్కగా సరితూగ గలుగుతుంది. అది ఆధ్యాత్మిక సంతృప్తి ప్రసాదించడంతోపాటు మానవుల్ని ప్రగతిశీలురుగా, న్యాయ బద్ధులుగానూ, దయామయులుగానూ, సహనశీలురు గానూ తీర్చిదిద్దుతుంది.

“అరబ్బు నాగరికత వికాసంతోపాటు మతసహనం కూడా తప్పనిసరి, ఈ యదార్థాన్ని రుజువు చేసేందుకు మేము అనేక ఉదాహరణలు ముందుంచాము. అరబ్బు శాస్త్ర వేతలు తమ కాలాన్ని బాగ్దాద్‌లో, తత్వశాస్త్రంలో అనేక పాఠాలు చెప్పేందుకు వెచ్చించేవారు. ఆ పాఠాలు గ్రహించే వారిలో, ముస్లిములతో పాటు యూదులు, నాస్తికులు, క్రైస్తవులు, ఇతరులు ఉండేవారు. వారిలో ఎవరయినా సరే ఏదయినా అడిగినప్పుడు గౌరవంగా పూర్తి శ్రద్ధగా, సమాధానాలు ఇవ్వబడేవి. వారు పుస్తకంలోని విషయం కన్నా హేతువును వినియోగించవలసిందని చెప్పేవారు. అటువంటి సహనశీలత ఎంత సుదీర్ఘ కాలం, వందలాది సంవత్సరాలుగా యుద్ధాల బారిన పడిన తరువాత కూడా యూరోపియన్లలో పుట్టలేకపోయింది.

“పఠితలు గమనించగలరు, అరబ్బుల విజయాల మన ఈ చర్చలో, వాటి కారణాలను వెతికినట్లయితే తేలేది, కేవలం బలం ఒక్కటే విజయానికి మూలం కాదు, అరబ్బులు పరాజితులకు తమ మతాన్ని అనుసరించే స్వేచ్ఛనిచ్చారు. కొందరు క్రైస్తవులు ఇస్లామ్ స్వీకరించారంటే, అరబీని తమ భాషగా మార్చుకున్నారంటే దానికి కారణం, విజేతలయిన అరబ్బుల న్యాయ పాలనే. అటువంటి న్యాయం వారు తమ మునుపటి విజేతల ద్వారా కానలేక పోవడమే. పైగా ఇస్లామ్‌లో వారికి లభించిన స్వేచ్ఛాయుత వాతావరణం. ఇది కూడా వారు మునుపు ఎరుగరు!

“మతం అన్నది బలవంతాన ఎవరిపైనా రుద్దడం సాధ్యమయ్యే విషయం కాదు, ఇది చారిత్రకంగా రుజువయిన విషయం. స్పెయిన్‌ని ముస్లిముల నుంచి జయించినప్పుడు, ముస్లిములు హతమవడానికయినా అంగీకరించారు కాని ఇస్లామ్‌ను వదల డానికి సమ్మతించ లేదు. అంతేకాదు, ఇస్లామ్ కరవాలం ద్వారా వ్యాపించలేదు, అది పిలుపు, ప్రచారం ఆధారంగానే వ్యాపించింది. దాన్ని తొలుత తురుష్కులు, మంగోల్ జాతీయులు స్వీకరించారు.”

“ముస్లిముల నాయకుడు, ఉమర్ ఫారూక్ బిన్ ఖత్తాబ్ జెరూసలేములోకి ప్రవేశించినప్పుడు, అందులో నివసించే వారిపట్ల ఆయన ఎంతో సహనం, సంయమనం ప్రదర్శించారు. అక్కడి వారు తమ మతం, ఆస్తులు, సంప్రదాయాల పట్ల రక్షణ పొందారు. ఆయన కేవలం ఓ చిన్న జిజ్యా మాత్రం విధించారు. అలాగే సిరియా నగరాల్లోనూ అరబ్బులు అటువంటి సహన భావాన్నే ప్రదర్శించారు. అక్కడి జనులు అతి త్వరగానే అరబ్బుల సార్వభౌమాధికారానికి తలఒగ్గారు. వారిలో చాలా మంది క్రైస్తవానికి బదులు ఇస్లామ్ స్వీకరించారు, అరబీ భాషనూ నేర్చుకున్నారు.

“అరబ్బుల నాగరికతా ప్రభావం, ప్రాచ్య దేశాల పైన ఎంత ఉందో పాశ్చాత్య దేశాలు, యూరోపు పైన అంత కన్నా తక్కువేమీ లేదు.”

# మనిషి జీవిత లక్ష్యం



**- నసీరా బేగం**

**ప్రతి** మనిషి ఈ ప్రపంచంలో తన కళ్ళు తెరుస్తాడు. జీవితం గడుపుతూ ఉంటాడు. కాని అతని జీవితంలో ఏదో ఒక సమయంలో అతని మదిలో ఒక ఆలోచన తప్పకుండా మెదులు తుంది. నేను ఈ ప్రపంచంలో ఎందుకు వచ్చాను, నా జీవిత లక్ష్యం ఏమిటి అని. ఆ తరువాత తన చుట్టూ ఉన్న ప్రజలను చూసి అతనిలో మరొక ప్రశ్న తలెత్తుతుంది. ఏమిటి ఈ ప్రపంచంలో మనం కేవలం ధనం సంపాదించటానికి, తినడానికి, త్రాగడానికి, జీవితావసరాలను తీర్చుకోవటానికే నివసిస్తున్నామా? అలా అయితే ఇక్కడ మనం చాలా మందినే చూస్తూ ఉన్నాము కదా! వారు ధనం సంపాదించటానికీ, దానిని కూడబెట్టడానికి, దాని ద్వారా ఎత్తైన భవనాలు కట్టడానికీ, హెూదాలు సంపాదిం చడానికీ, గౌరవాన్ని పొందడానికీ తమ పూర్తి జీవితాన్ని వెచ్చి స్తున్నారు. చివరకు అంతా వదలి ఖాళీ చేతులతో ఇట్టే వెళ్ళి పోతున్నారు? వారు జీవిత లక్ష్యం గురించి ఆలోచించే ప్రయత్నం చెయ్యలేదా? ఆలోచించినా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చెయ్యలేదా? అని.

మనిషి తన జీవిత లక్ష్యం కేవలం ధనం సంపాదించటం, దానిని కూడబెట్టడం, వివాహం చేసుకోవటం, పిల్లలను కనటం. ఈ విషయాలలో అందరికంటే ముందు పరుగెత్తుతూ ఉండటం, వీటినే గౌరవానికి, ఉన్నతికి ప్రతీకలుగా చేసుకుంటూ జీవిస్తూ ఉన్నట్లయితే క్రమక్రమంగా అతని జీవిత సమయం కరుగుతూ పోతూ ఉంటుంది. అతని జీవితాన్ని చూస్తూ ఉన్న కొంతమంది అతను తన జీవితంలో సాఫల్యాన్ని పొందాడని భావిస్తారు. కాని అసలు సాఫల్యం కేవలం తాను నిర్ణయించుకున్న లక్ష్యాలను పొందటం ఎంతమాత్రం కాదు. అసలు సాఫల్యం మనిషి ప్రపంచ జీవితాన్ని దైవాజ్ఞలను అనుసరించి గడపటం, పరలోకంలో స్వర్గాన్ని పొందటం. ఎందుకంటే ఈ ప్రాపంచిక జీవితం కొన్ని సంవత్సరాలు మాత్రమే. అసలు జీవితం పరలోక జీవితం.

ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు; ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం. శాశ్వత నివాస స్థలం పరలోకమే (40: 39). కాని మీరు ఐహిక జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వాస్తవానికి పరలోక జీవితమే మేలైనది, శాశ్వతమైనదీను. (87: 16,17) ఈ ప్రాపంచిక జీవితం ఒక క్రీడ, ఒక వినోదం తప్ప మరేమీ కాదు, అసలు జీవన గృహం పరలోక గృహమే.

(29: 64)

పై వాక్యాలలో ఇహలోక జీవితం తాత్కాలికమైనది మరియు ఒక వినోదం మాత్రమే అని చెప్పబడింది. కాని దీని అర్థం ఇహలోక జీవితాన్ని త్యజించి ఒక మూలన కూర్చొని ఉండిపోవటం అని ఎంతమాత్రమూ కాదు. దాని భావం ఏమిటంటే, ఈ ప్రాపంచిక జీవితం చాలా అల్పమైనది, బహు స్వల్పమైనది. దానికి వ్యతిరేకంగా పరలోక జీవితం కలకాలమైనది, మేలైనది. కనుక ఈ అల్పమైన జీవితంలో కలకాల జీవితం ప్రభావితమయ్యే

**మిగతా 34వ పేజీలో...**



# క్షణభంగురం ఈ ప్రాపంచిక జీవితం

- షేఖ్ అబ్దుల్ బాసిత్

**మరణం మనిషి జీవితంలో అనివార్యమైన ఘట్టం. పుట్టింది గిట్టడానికే. ఇది మనందరికీ తెలిసిన జీవిత సత్యం.**

మరణించే ప్రతి ఒక్కరూ ఈ జీవితం శాశ్వతం కాదని. పుట్టిన ప్రతివాడూ మరణించక తప్పదనే సత్యాన్ని మాటిమాటికీ మనకు గుర్తు చేస్తారు. కాని కళ్ళ ముందు ప్రాపంచిక మాయ తెర మనల్ని ఈ జీవిత సత్యాన్ని నమ్మనివ్వదు.

బాగా తెలుసుకోండి. ఈ జీవితం ఒక ఆట, ఒక వినోదం, బాహ్య పటాటోపం, పరస్పరం ప్రగల్భాలు వలకటం, సంపద, సంతానాల విషయంలో ఒకరిపై ఒకరు ఆధిక్యం పొందటానికి ప్రయత్నించటం తప్ప మరేమీ కాదు. (57:20)

నేటి శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో మనిషి చేయలేనిది ఏదీ లేదు. క్షణాల్లో విశ్వాన్ని భస్మం చేయగలడు. కానీ చేయలేనిది ఏమైనా ఉందా అంటే అది మరణాన్ని ఒక క్షణం ఆపటం.

అందుకే సృష్టికర్త అయిన దేవుడు ఇలా ప్రశ్నిస్తున్నాడు :

''ఇక మీరు గనక ఎవరికీ బానిస కాకపోతే, ఈ అభిప్రాయంలో మీరు గనక సత్యవంతులే అయితే, చనిపోయే వాడి ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, అతడు చనిపోతున్నాడని మీరు కళ్ళారా చూస్తూ ఉంటారు, ఆ సమయంలో పోయే ప్రాణాన్ని మీరు తిరిగి ఎందుకు తీసుకురాలేరు? అప్పుడు మీకంటే మేము అతనికి చాల దగ్గరలో ఉంటాము, కాని మీకు కనిపించము. తరువాత ఆ చనిపోయే మనిషి సాన్నిధ్యులలోని వాడైతే, అతని కొరకు సుఖం, మంచి ఆహారం, మహా భాగ్యాలతో నిండి ఉన్న స్వర్గం ఉంటాయి. ఒకవేళ అతడు కుడిపక్షం లోనివాడై ఉంటే, ''నీకు శాంతి కలుగుగాక! నీవు కుడిపక్షంలోని వాడవు'' అని అతనికి స్వాగతం చెప్పబడు తుంది. ఒకవేళ అతడు తిరస్కరించే మార్గభ్రష్టులలోని వాడై ఉంటే, అతనికి ఇవ్వబడే ఆతిథ్యం సలసల కాగే నీరు మరియు నరకంలోకి విసరివేయటం''

(56: 83-94)

సృష్టికర్త అయిన అల్లాహ్ ఈ జీవిత సత్యాన్ని మాటిమాటికీ ప్రస్తావిస్తూ మానవ జీవిత మర్మాన్ని తెలుసుకుని మసలుకోమని హెచ్చరించాడు ఖురాన్‌లో.

అంతే కాదు, పుట్టినప్పుడే నుదుట మరణ సమయం కూడా వ్రాసి పంపాడు.

''ఆయనే మిమ్మల్ని ఒకే ప్రాణినుండి పుట్టించాడు. ఇంకా ప్రతి ఒక్కరికీ ఒక నివాస స్థలం ఉంది. అప్పగించబడే ఒక స్థలం ఉంది. విజ్ఞత ఉన్నవారి కొరకు మేము ఈ సూచన లను స్పష్టపరిచాము''.(6:98)

''అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృగర్భాలనుండి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటికి తీశాడు. ఆయన మీకు చెవులు ఇచ్చాడు. కళ్ళు ఇచ్చాడు. ఆలోచించే మనస్సూ ఇచ్చాడు - మీరు కృతజ్ఞులు కావాలని,'' (16: 78)

తమ ధర్మాన్ని ఒక క్రీడగా, ఒక తమాషాగా భావించినవారిని ఇహలోక జీవితం మాయకు గురిచేసిన వారిని నీవు వదలిపెట్టు. కాని ఈ ఖురానును వినిపించి హితబోధ చెయ్యి. హెచ్చరిక చేస్తూ ఉండు. ఎందుకంటే, ఏ వ్యక్తీ తాను చేసిన చేష్టల దుష్ఫలితంలో చిక్కుకోకూడదు. (6:70)

ఈ మరణం ఏ రూపంలో ఎక్కడ ఎలా వస్తుందో కూడా తెలియదు.

"ఏదైనా శిక్షను పైనుండి మీపై అవతరింప చేయగలడు లేదా మీ పాదాలకింద నుండి తీసుకురాగలడు లేదా మిమ్మల్ని వర్గాలుగా విభజించి ఒక వర్గం బలాన్ని మరొక వర్గానికి రుచి చూపించగలడు." చూడండి! వారు బహుశా సత్యాన్ని గ్రహిస్తారని, మేము ఏవిధంగా మా సూచనలను మాటిమాటికీ రకరకాలుగా వారి ముందు పెడుతున్నామో! అది సత్యం. అయినా,మీ జాతి దాన్ని తిరస్కరిస్తోంది". (6:65-66)

ప్రతి రోజూ మనం నిదుర రూపంలో మరణం ముంగిట నిలిచి వస్తాం

"ఆయనే రాత్రివేళ మీ ఆత్మలను వశపరచుకుంటాడు. పగటివేళ మీరు చేసేదంతా ఆయన తెలుసుకుంటాడు. మళ్ళీ రెండోరోజు ఆయన మిమ్మల్ని ఈ వ్యవహార ప్రపంచంలోకి తిరిగి పంపుతాడు, మీ నిర్ణీత జీవిత కాలం పూర్తికావటానికి. చివరకు మీరు ఆయన వైపునకే మరలి పోవాలి. అప్పుడు ఆయన మీకు మీరు చేస్తూ ఉన్నదంతా చూపుతాడు. తన దాసులపై ఆయనకు పూర్తి అధికారం ఉంది .మిమ్మల్ని కనిపెట్టి ఉండేవారిని నియమించి పంపుతాడు. చివరకు మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు, ఆయన పంపిన దూతలు అతని ప్రాణం తీసుకుంటారు. తమ కర్తవ్య నిర్వహణలో వారు ఏమాత్రం అజాగ్రత్త చూపరు" (6:59-61)

ఆ మరణం ఎప్పుడు ఎక్కడ ఎలా వస్తుందో మనలో ఎవరికీ తెలియదు.

"చూడండి అల్లాహ్ మిమ్మల్ని పుట్టించాడు. తరువాత ఆయన మీకు మృత్యువును కలుగజేస్తాడు. మీలో ఒకడు అతి నికృష్టమైన వయస్సుకు చేర్చబడతాడు. అంతా తెలిసిన తరువాత కూడా ఏమీ తెలియనివాడుగా అయ్యేందుకు. సత్యం ఏమిటంటే అల్లాహ్ మాత్రమే జ్ఞానంలో కూడా పరిపూర్ణుడు, శక్తిలో కూడా." (16:70)

అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రాణి కూడా చావజాలదు. మరణకాలం వ్రాయబడే ఉంది. ప్రాపంచిక ప్రతిఫలం పొందే ఉద్దేశ్యంతో పని చేసే వాడికి మేము ప్రపంచాన్నుండే ఇస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పని చేసేవాడు పరలోక ప్రతిఫలాన్ని పొందుతాడు. కృతజ్ఞతలు తెలిపే వారికి మేము వారి ప్రతిఫలాన్ని తప్పకుండా ప్రసాదిస్తాము. (3:145)

ప్రవక్తా! ప్రపంచ దేశాలలో ఉన్నటువంటి అవిశ్వాసులు దర్జాగా తిరుగాడటం నిన్ను మోసంలో పడవేయ రాదు. అది కేవలం కొన్ని రోజుల జీవితపు కొద్దిపాటి సుఖం మాత్రమే. తరువాత వారంతా నరకానికి పోతారు. (3:196)

అందుకే ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: అల్లాహ్‌కు భయపడండి. ప్రతి వ్యక్తి రేపటి కొరకు ఏమి సమకూరుస్తున్నారో చూసుకోవాలి. అంటే మరణా నంతరం పనికి వచ్చే మంచి పనులు ఏమి చేస్తున్నాడో చూసుకోవాలి.

ఎందుకంటే రేపు మనం మరణించిన తరువాత మన వెంట ఏదీ రాదు కదా!


యువతరానికి
**విప్లవనాదం**
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
**గీటురాయి**
వారపత్రిక

**ఒక వారం చదవండి**
**ప్రతి వారం చదువుతారు !**

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

**ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.**

బ్యాంక్ అకౌంట్ వివరాలు
**GEETURAI WEEKLY**
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
**A/c. No. 1042789768**
**IFSC Code. CBIN0282407**

**లేదా**

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

**GEETURAI WEEKLY**
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




## హజ్ యాత్రకు వేలల్లో దరఖాస్తులు

వచ్చే ఏడాది హజ్ యాత్రకు వెళ్లేందుకు 11,414 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలంగాణ హజ్ కమిటీ తెలిపింది. హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7న గడువు ముగిసింది. 2, 3 రోజుల్లో డ్రా తీసి యాత్రికులను ఎంపిక చేయనున్నారు. యాత్రకు ఎంపికైన వారు మొదటి విడతలో రూ.1.5 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని కమిటీ పేర్కొంది.

## సీనియర్ సిటిజన్స్, ఉద్యోగులకు కొత్త ప్యాకేజీ

2026లో హజ్ యాత్రకు వెళ్లే సీనియర్ సిటిజన్లకు హజ్ కమిటీ కొత్త ప్యాకేజీ ప్రకటించింది. సాధారణంగా ఈ యాత్ర 42 రోజుల పాటు ఉంటుంది. అయితే వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా 20 రోజుల హజ్ యాత్ర చేపట్టనుంది. ఇది కోరుకున్న వారికి మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ షార్ట్ టర్మ్ యాత్రకు ఎంత మొత్తం ఖర్చవుతుందనేది త్వరలో చెబుతామని హజ్ కమిటీ కమిటీ ఈవో సాజిద్ అలీ తెలిపారు.

## సెప్టెంబరు 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక

ఉప రాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబరు 9న ఎన్నికలు నిర్వహిస్తామని.. అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రకటించింది. ఈ నెల 21 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అని, 22న వాటిని పరిశీలిస్తామని పేర్కొంది. ఈ నెల 25 వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చని వివరించింది. ఆరోగ్య కారణాలతో జగదీప్ ధన్‌ఖడ్ ఉపరాష్ట్రపతి పదవికి జూలై 21న రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎన్డీయే కూటమి ఇటీవల సమావేశమైంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీకి కూటమి నేతలంతా హాజరై ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక, ఎన్నికల సమన్వయంపై చర్చించారు.

## టిప్పు సుల్తాన్‌ను పాఠ్యాంశాల నుండి తొలగించిన ఎన్‌సీఈఆర్‌టీ!




కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరించేందుకు, వాస్తవాలను మార్చేందుకు ప్రయత్నాలు చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ ఎన్‌సీఈఆర్‌టీ మరో వివాదాస్పద చర్యకు పాల్పడింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (NCERT) 8వ తరగతి చరిత్ర సిలబస్ నుండి టిప్పు సుల్తాన్, హైదర్ అలీ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర పాఠాలను తొలగించింది. జాతీయ విద్యా విధానం (NEP) 2020, పాఠశాల విద్య కోసం జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ (NCF-SE) 2023 కింద ఈ మార్పు జరిగింది. టిప్పు సుల్తాన్ తన ధైర్యసాహసాలతో ప్రసిద్ధి చెందాడు. అప్పట్లోనే ప్రతి ఒక్కరి ప్రశంసలు అందుకున్నాడు. అతను, అతని తండ్రి హైదర్ అలీ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. భారతదేశానికి ముఖ్యమైన స్వాతంత్ర్య పోరాట ఉద్యమం అయిన ఆంగ్లో-మైసూర్ యుద్ధాలకు నాయకత్వం వహించారు. రజియా సుల్తానా, నూర్జహాన్ కూడా భారత చరిత్రలో ప్రముఖ మహిళామణులు. పాఠ్యపుస్తకాల నుండి వారి పేర్లను తొలగించటం అనేక ప్రశ్నలను లేవనెత్తింది. దీనిపై అభ్యంతరాలను లేవనెత్తుతూ, ఎంపీ రితాబ్రత బెనర్జీ ఆగస్టు 6న పార్లమెంటులో తన ఆందోళనలను వ్యక్తం చేశారు.

## పౌరసత్వం వదులుకుంటున్న భారతీయులు.. కారణం ఇదే..

భారతీయులుగా పుట్టిన వారు ఇప్పుడు భారతీయులు కాకుండా పోతున్నారు. యువకులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి.. అక్కడి అలవాట్లకు.. టెక్నాలజీకి అలవాటుపడి దేశాన్ని వదిలేస్తున్నారు. డాలర్లలో సంపాదిస్తూ... అటు కన్నవారికి.. ఇటు దేశానికి దూరం అవుతున్నారు. తాజాగా.. 2024లో రెండు లక్షలకు పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని ప్రభుత్వం తెలియజేసింది. గత ఐదు సంవత్సరాలలో ఎంత మంది భారత పౌరసత్వాన్ని వదులుకుని ఇతర దేశాల పౌరసత్వం తీసుకున్నారనే దానిపై వచ్చిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయం తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ కెసి వేణుగోపాల్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.




## దుబాయిలో 6 మాసాల్లో 3,600 మంది ఇస్లాం స్వీకరణ

దుబాయిలో ఈ ఏడాది మొదటి ఆరు నెలల వ్యవధిలో 3,600 మంది ఇస్లాం మతాన్ని స్వీకరించగా, మరో 1300మంది ఇస్లాం విజ్ఞాన విద్యలో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. అంటే సగటున రోజుకు 19 మంది ఇస్లామ్ మతాన్ని స్వీకరించారని తెలిపింది. దుబాయి ప్రభుత్వ ఇస్లామిక్ సంస్కృతి, దాన ధార్మిక శాఖ ఆధ్వర్యంలో నడిచే ముహమ్మద్ బిన్ రాషిద్ ఇస్లామిక్ సాంస్కృతిక కేంద్రాన్ని ఉటంకిస్తూ.. ప్రభుత్వ అధికారిక వార్తా సంస్థ ఈ మేరకు వివరాలను వెల్లడించింది. ఇస్లాం మహోన్నత విలువలను తెలియజేస్తూ పరమత సహన విలువలను తమ సంస్థ ప్రచారం చేస్తుందని దాని సంచాలకుడు జాసిం అల్ ఖరాజీ చెప్పారు. నాగరికత మధ్య సాంస్కృతిక వారధిగా, ఇస్లాంలోని సహనం, విజ్ఞానం, పరస్పర అవగాహన అంశాలకనుగుణంగా తాము పని చేస్తున్నామని తెలిపారు.

## పాలస్తీనాను గుర్తిస్తాం : ఆస్ట్రేలియా

సెప్టెంబరులో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాలస్తీనా దేశాన్ని గుర్తిస్తామని ఆస్ట్రేలియా ప్రధాని ఆంతోనీ ఆల్బనేస్ చెప్పారు. పాలస్తీనాను గుర్తిస్తామని బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా దేశాలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. మధ్య ప్రాచ్యంలో హింసకు స్వస్తి చెప్పేందుకు, ఘర్షణను నివారించేందుకు, గాజాలో ఆకలి మంటలను చల్లార్చేందుకు, ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు రెండు దేశాలు పరిష్కారం కనుగొనాలని మానవాళి కోరుకుంటోందని ఆయన విలేకరులతో అన్నారు. భవిష్యత్తులో పాలస్తీనా వ్యవహారాలలో హమాస్‌కు ఎలాంటి పాత్ర ఉండబోదని పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ హామీ ఇవ్వడంతో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని ఆల్బనేస్ వివరించారు. బ్రిటన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్, జపాన్ దేశాల ప్రధానులతో పక్షం రోజులుగా ఇదే విషయంపై చర్చలు జరుపుతున్నానని ఆయన చెప్పారు. ఓ అవకాశం వచ్చిందని, దానిని ఉపయోగించుకునేందుకు అంతర్జాతీయ సమాజంతో కలిసి కృషి చేస్తామని తెలిపారు.

## 45 ఏళ్లు పైబడిన ప్రతీ ఐదుగురిలో ఒకరికి మధుమేహం.. లాన్సెట్ నివేదిక

భారత్‌లో మధుమేహం వేగంగా విస్తరిస్తోంది. ఒక అధ్యయనంలో 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వారిలో ప్రతి ఐదుగురిలో ఒకరు మధుమేహంతో జీవిస్తున్నట్టు గుర్తించారు. వారిలో కూడా ప్రతి ఐదుగురిలో ఇద్దరికి తమకు ఈ వ్యాధి ఉన్నట్టు తెలియదని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. భారత్‌లో మధ్య వయస్కులు, వృద్ధుల్లో మధుమేహం కేసులు పెరుగుతున్నాయని ఈ అధ్యయనం పేర్కొంది. 2017-2019 మధ్య కాలంలో 45 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న 60 వేల మందిపై లాంగిట్యూడినల్ ఏజింగ్ స్టడీ ఇన్ ఇండియా (ఎల్ఏఎస్ఐ) ఒక సర్వే నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్లు ఎక్కువగా డయాబెటిస్ బారిన పడుతున్నట్టు గుర్తించింది.

## 20 వేల డాలర్లకు గ్రీన్‌కార్డు!

అమెరికాలో శాశ్వత నివాసానికి జారీ చేసే గ్రీన్ కార్డు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణకు చెక్ పెట్టేందుకు ఓ ప్రతిపాదన ముందుకు వచ్చింది. గ్రీన్‌కార్డు కోసం పదేళ్లకు పైగా ఎదురు చూస్తున్న వారు 20 వేల డాలర్లు (రూ.17.5 లక్షలు) చెల్లిస్తే వారి దరఖాస్తును త్వరగా పరిష్కరించేందుకు అవకాశాన్నిచ్చే బిల్లును యూఎస్ ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. 2035లోగా చట్టబద్ధమైన వీసా బ్యాక్‌లాగ్‌లు గణనీయంగా తగ్గించేందుకు డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరుతో సభ్యులు మారియా ఎల్విరా సలాజర్, వెరోనికా ఎస్కోబార్ ఆ బిల్లును ప్రతిపాదించారు. దశాబ్దాలుగా ఉన్న సమస్య పరిష్కారానికి ఈ బిల్లును తెచ్చినట్లు సలాజర్ చెప్పారు. ప్రతిపాదిత బిల్లు ప్రకారం.. కుటుంబం లేదా ఉద్యోగాల విభాగాల్లో గ్రీన్‌కార్డు కోసం దశాబ్దానికి పైగా నిరీక్షిస్తున్న వారు ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజు కింద 20 వేల డాలర్లు చెల్లించే అవకాశం ఉంటుంది. ఫీజు చెల్లించిన వారికి ప్రామాణిక క్యూ కంటే ముందు కార్డు పొందే అర్హత వస్తుంది. ఉద్యోగ ఆధారిత, ఫ్యామిలీ స్పాన్సర్డ్ గ్రీన్‌కార్డుల్లో ఒక్కో దేశానికి గరిష్ఠంగా ఉన్న 7 శాతం పరిమితిని 15 శాతానికి పెంచాలని బిల్లులో ప్రతిపాదించారు. అలాగే డాక్యుమెంటెడ్ డ్రీమర్స్ శాశ్వత నివాసానికి ఓ మార్గాన్ని బిల్లు సూచించింది. వర్క్ వీసాపై అమెరికాకు వచ్చిన వారి పిల్లలు పదేళ్ల పాటు స్థిరంగా ఇక్కడే నివాసం ఉన్నట్లయితే వారికి చట్టబద్ధ శాశ్వత నివాస (ఎల్‌పీఆర్) హోదాను కల్పించనున్నారు.

29వ పేజీ తరువాయి...

# మనిషి జీవిత లక్ష్యం

కార్యాలు చెయ్యకూడదు అని, అసలు ఇహలోక జీవితం ఎందుకు ప్రసాదించబడిందంటే కలకాలం జీవితం కోసం సత్కార్యాలు సంపాదించుకోవడం కోసం మాత్రమే. ఒకవేళ మనిషి ఈ క్లుప్తమైన జీవితాన్నే గనక గమ్యస్థానంగా చేసుకున్నట్లయితే మనిషి ఈ జీవితం ముగిసిపోయినప్పుడు, కలకాల జీవితం ప్రారంభమైనప్పుడు దాని కోసం ఏమీ సిద్ధం చేసుకోకుండా ఖాళీ చేతులతో ఉండిపోయినప్పుడు మనిషి పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు. అప్పుడు అతనికి ఇహలోక జీవితం కేవలం కొన్ని ఘడియలుగా మాత్రమే అనిపిస్తుంది.

ఈ విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో ఇలా తెలియజేశాడు : అల్లాహ్ వారిని ఇలా అడుగుతాడు: "చెప్పండి. భూలోకంలో మీరు ఎన్ని సంవత్సరాలు ఉన్నారు?" వారు "మేము ఒక రోజు లేక రోజులో కొంత భాగమో అక్కడ ఉన్నాము. లెక్కపెట్టే వారిని అడగండి" అని అంటారు; ఇలా సెలవీయబడుతుంది. "కొంత కాలమే ఉన్నారు కదా! అయ్యో మీరు ఈ విషయాన్ని అప్పుడు తెలుసుకుని ఉంటే ఎంత బాగుండేది. మేము మిమ్మల్ని వృధాగానే పుట్టించామని, మా వైపునకు మీరు ఎన్నడూ మరలి రావటమనేది జరగదని భావించారా?" (23: 112- 115)

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు; ప్రపంచం యొక్క ఉపమానం పరలోకం ముందు ఎలాంటిదంటే, మీలో నుంచి ఎవడైనా ఒక వ్యక్తి తన చేతివ్రేలును సముద్రంలో ముంచి తీస్తే ఆ వ్రేలుకు ఎంత నీరు తగులుతుందో అంతే. (ముస్లిమ్)

ఆయన(స) ఇచ్చిన ఈ ఉపమానం ద్వారా తెలిసిన విషయమేమిటంటే, సముద్రపు నీటి ముందు మనిషి వ్రేలుకు తగిలి వచ్చిన నీటి బొట్టు విలువ ఏమీ ఉండదు. అదే విధంగా పరలోక జీవితం ముందు ఇహలోక జీవితం విలువ కూడా ఏమీ ఉండదు.

ఒక ఆత్మ మనిషి శరీరంలో ఒక సారి ప్రవేశించి ఈ ప్రపంచంలో పుట్టినప్పుడు ఆ తరువాత అతని ముందు ఎప్పుడూ అంతం కాని జీవితం ప్రారంభమైపోతుంది. ఈ అంతం కాని జీవితం అతనిది మూడు దశలలో విభజింపబడి ఉంటుంది. ఒకటి అతని పుట్టుక నుంచి మరణించేవరకు. మరణించిన తరువాత మనిషిని మట్టిలో పూడ్చివేయటం జరుగుతుంది. కాని అక్కడినుంచి రెండో దశ ప్రారంభమవుతుంది. అది అతని మరణం నుంచి ప్రళయం వచ్చేవరకు అతని ఆత్మ 'ఆలమే బర్‌జఖ్' (ఆత్మల ప్రపంచం)లో ఉంటుంది. సత్కార్యాలు చేసుకున్న ఆత్మలు ఇల్లియ్యీన్‌లోను దుష్కార్యాలు చేసుకున్న ఆత్మలు సిజ్జీన్‌లోను ఉంచబడతాయి. ఆ తరువాత ప్రళయం సంభవించినప్పుడు అతని మూడో దశ ప్రారంభమవుతుంది. ఇక ఆ దశ ఎన్నటికీ అంతం కాదు. అక్కడ ఇక మరణం అనేది ఉండదు. ఇక మరలటం అనేది ఎంత మాత్రమూ ఉండదు. మొదటి రెండు దశలు ఏదో ఒక రోజున అంతమవుతాయి. కాని మూడో దశకు మాత్రం అంతం లేదు అని స్పష్టంగా ఖుర్‌ఆన్, హదీసులు వివరంగా తెలియజేస్తున్నాయి.

ఇక ఈ మూడు దశలలో క్లుప్తమైనది, కొన్ని రోజుల ప్రాపంచిక జీవితం. మనిషి ఈ దశకే అధిక ప్రాముఖ్యతనిస్తాడు. కాని విచారకరమైన విషయమేమిటంటే మనిషి రెండో దశ, మూడో దశ జీవితం గురించి బహు తక్కువగా ఆలోచిస్తాడు.

హజ్రత్ జాబిర్(ర) ఇలా తెలియజేశారు: ఒకసారి దైవప్రవక్త(స) కొంతమంది సహచరులతో కలిసి వెళుతూ ఉండగా మార్గ మధ్యంలో ఒక చెవి తెగిపోయి ఉన్న ఒక మృత మేకపిల్లను అక్కడ పడి ఉండగా చూశారు. ఆ తరువాత తమ సహచరులను సంబోధించి ఇలా అన్నారు; మీలో ఎవరు ఒక దిర్హమ్‌లో ఈ మృత మేకపిల్లను కొనటానికి ఇష్టపడతారు అని. దానికి ఆయన(స) సహచరులు ఓ దైవప్రవక్తా(స)! మాలో ఎవరూ దీనిని ఎంతమాత్రమూ కొనటానికి ఇష్టపడరు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు : దైవసాక్షిగా! అల్లాహ్ దృష్టిలో ఈ ప్రపంచం విలువ కూడా అంతే. ఏ విధంగానైతే మీ దృష్టిలో ఈ మృత మేకపిల్ల విలువ ఉందో. (ముస్లిమ్).

హజ్రత్ ఉమర్(ర) ఇలా తెలియజేశారు : ఒకసారి దైవప్రవక్త(స) నా రెండు భుజాలను పట్టుకుని ఇలా సెలవిచ్చారు; ఓ ఉమర్! ఈ ప్రపంచంలో నీవు ఒక బాటసారి మాదిరిగా జీవించు అని. అంటే ప్రాపంచిక జీవితాన్ని త్యజించి కొండల్లో కోనల్లో జీవించటం అని దీని భావం కాదు. నీ గమ్యస్థానం ఈ ప్రపంచం కాదు అని, ఈ మార్గం పరలోకంలో స్వర్గం పొందటానికి. అసలు గమ్యస్థానం పరలోకం. ఆ పరలోక జీవితాన్ని తీర్చిదిద్దుకో. మార్గమధ్యమైన ప్రాపంచిక జీవిత భోగభాగ్యాలలో పడిపోయి పరలోక జీవితాన్ని నష్టపరచుకోకు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**